KSR02B175

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జులై 09, 2017

కథా నిలయం
ENTERED
శ్రీకాకుళం

పుడమి దీపాలు

ఆస్కార్ అతిధులు

సినిమాలని మోషన్‌పిక్చర్స్ అని పిలవడం ఎప్పుడు మొదలైందో ఎంతమందికి తెలుసు. ఎందుకంటే అమెరికాలో మాత్రం 'ది అకాడెమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్స్' (ఎమ్‌పిఎఎస్) పేరుతో ఒక ప్రతిష్టాత్మక సంస్థని ఏర్పాటుచేశారు. ఈ సంస్థ ప్రతి ఏటా అందించే అకాడెమీ అవార్డ్స్ ద్వారా ప్రపంచ స్థాయి ఖ్యాతిని గడించింది. ఇప్పటికి ఎఎమ్‌పి ఎస్‌కి తొంభై వసంతాలు పూర్తయ్యాయి. ఈ అకాడెమీ అవార్డ్స్‌నే మనం ఆస్కార్ అవార్డ్స్‌గా పిలిచేసుకుంటున్నాం. ఇటీవలే ఆస్కార్ గ్రాంటింగ్ బాడీ (న్యాయనిర్ణేతల కమిటీ) ప్రపంచ వ్యాప్తంగా 744 మందికి ఆహ్వానాలని పంపింది. వీరిలో గతంలో కంటే ఈసారి బాలీవుడ్ నుంచి ఎక్కువ మంది అతిధులుగా వెళ్తున్నారు. మనకు సరిగా పరిచయంలేని భారతీయ సినీ దిగ్గజాలైన దర్శకులు మృనాల్ సేన్, బుద్ధదేవ్ దాస్ గుప్త, గౌతమ్ ఘోష్ , సినీ రచయిత సోనీ తరపోరేవాలా, కాస్ట్యూమ్ డిజైనర్ అర్జున్ భాసిన్, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత ఆనంద్ పట్వర్ధన్, సౌండ్ డిజైనర్ అమ్రిత్ ప్రీతమ్ దత్త కూడా ఉన్నారు. ఇక హాలీవుడ్‌కూ బాగా తెలిసిన అమితాబ్, ప్రియాంక చోప్రా, దీపికా పదుకొన్, ఐశ్వర్యా రాయ్, ఇర్ఫాన్ ఖాన్, అమీర్ ఖాన్, సల్మాన్ ఖాన్ కూడా పురస్కార వేడుకల్లో సందడి చేయనున్నారు.

KSR02B125
ENTERED



మంచు నృత్యం

వాళ్లు గిర్రున తిరుగుతుంటే మన తల తిరుగుతుంది. బుల్లెట్‌లా దూసుకుపోతుంటే మనం తమాయించుకునే ప్రయత్నం చేస్తాం. ఒళ్లంతా విరిచేసి ఒక సన్నని బ్లేడ్‌పై విన్యాసాలు చేస్తుంటే రబ్బర్ బొమ్మల్లా కనిపిస్తారు. శరీరం అలా కూడా వంగుతుందా అని నోరెళ్లబెట్టేస్తాం. ఇవన్నీ ఐస్ స్కేటింగ్ దృశ్యాలు.. రింక్‌లోను ఆడియెన్స్ గేలరీలోను. వింటర్ ఒలింపిక్స్‌లో హైలెట్ ఈ మంచు నృత్యం. మంచు తలంపై బ్లేడ్‌తో అసాధారణమైన వేగంతో సర్రున జారుతూ అనూహ్యమైన భంగిమల్లో నాట్యం చేసే క్రీడాకారులు మనకు ఉన్నారా..? అనే అనుమానం కూడా కలుగుతుంది. కానీ, అద్భుతమైన ప్రదర్శనలతో సంచలనం సృష్టిస్తున్నాడు భారతీయ ఫిగర్ స్కేటర్ నిశ్చయ్ లూత్రా. అతి తక్కువ కాలంలో భారత్‌కు అంతర్జాతీయంగా నాలుగు స్వర్ణాలను సాధించిన ఘనత ఈ ఢిల్లీ కుర్రాడిదే. 2018లో దక్షిణ కొరియాలో జరిగే వింటర్ ఒలింపిక్స్‌లో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించి దేశానికి మంచు పతకం తేవాలనేది ఈ విజేత జీవితాశయం.

నిశ్చయ్ మార్చి 9, 1999లో న్యూఢిల్లీలో జన్మించాడు. అతడి తల్లి ప్రభుత్వ ఉద్యోగి. స్కేటింగ్‌కు ముందు అతడు బాస్కెట్‌బాల్, తైక్వాండో, క్రికెట్ ఆడేవాడు. రాష్ట్ర స్థాయి అథ్లెట్ కూడా. పదేళ్ల వయస్సులో రోలర్ స్కేటర్‌గా కెరీర్‌ను ప్రారంభించాడు. అతని ప్రతిభని గమనించిన తల్లి ఎలాగైనా సరే కొడుక్కి ఉన్నత స్థాయి శిక్షణ ఇప్పించాలని నిర్ణయించుకుంది. కానీ ఐస్ స్కేటింగ్‌లో శిక్షణనిచ్చేవాళ్లు చాలా అరుదు. అందుకే ఆన్‌లైన్‌లో కోచ్ వేటను మొదలెట్టగా, వాసుదేవ్ తండి అనే కోచ్ గురించి తెలిసింది. నిశ్చయ్‌కు ఐస్ స్కేటింగ్‌లో మెళకువలను నేర్పాడు. రెండేళ్ల కాలంలో రింక్‌లో చెలరేగిన లూత్రా పతకాల వేటకు బ్లేడ్‌లను సవరించుకున్నాడు.

ఆరే నెలల్లో...

సాధారణంగా ఐస్ స్కేటింగ్‌లో మాస్టర్ అవ్వాలంటే ఆరేళ్ల పాటు కఠోర శిక్షణలో రాటుదేలాలి. కానీ అంత సమయం, డబ్బు అమెరికాలో వినియోగించే శక్తి లేదు నిశ్చయ్‌కి. అందుకే ఉన్న ఆరునెలలైనా ఫిగర్ స్కేటింగ్‌లో సునిశిత అంశాల్ని వంటబట్టించుకునేందుకు శరీరంతో ఓ యుద్ధమే చేశాడని చెప్పాలి. అక్కడ ఆరు నెలలు కఠినమైన తర్ఫీదుతో రాటుదేలాడు. మియామిలోనే జాన్సన్ వద్ద శిక్షణ పొందిన సమయంలో ఆరేళ్ల చిన్నారుల గ్రూప్ నుంచి కూడా ఎన్నో విషయాల్ని పరిశీలించాడు. 20 మంది ఉండే ఆ గ్రూప్‌ను గమనిస్తూ కూడా చాలా అంశాలను నేర్చుకున్నాడు. రింక్‌లో ఒక ఎక్సెల్ లూప్ నుంచి మూడు లూప్‌లను చుట్టేసేలా రాటుదేలాడు.

రెండేళ్లలోనే ఆటపై పట్టు సాధించిన నిశ్చయ్ 2011లో షిమ్లాలో జరిగిన నేషనల్ ఐస్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో తొలి స్వర్ణంతో మెరిశాడు. 2012లో తన జైత్రయాత్రను మరింత కొనసాగించాడు. ఇక్కడ సింగిల్స్, జంట ఈవెంట్ల లోనూ స్వర్ణాలను ఖాతాలో వేసుకున్నాడు. ఆ తర్వాత ఇండోర్ స్కేటింగ్ రింక్‌లోను శిక్షణ పొందాడు. 2013లో జాతీయ ఛాంపియన్‌షిప్‌లో సింగిల్స్, జంట ఈవెంట్లల్లో రజతాలను సాధించాడు. 2014లో ఆ రెండింటిల్లోను స్వర్ణాలతో సత్తా చాటాడు.

షిమ్లాలో స్వర్ణంతో...

మనీలా, ఫిలిప్పైన్స్‌ల్లో 2014లో జరిగిన వరల్డ్ డెవలప్‌మెంట్ ట్రోఫీలోను కాంస్యాన్ని దేశానికి అందించాడు. తనలోని లోపాలను అధిగమించేందుకు మెరుగైన శిక్షణే శరణ్యంగా భావించిన నిశ్చయ్ 2015లో అమెరికాలో శిక్షణకు మకాం మార్చాడు.



నెలకు శిక్షణకే రమారమి 3 నుంచి 4 లక్షలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. టాప్ స్కీమ్ కింద భారత్ ప్రభుత్వం కేటాయించిన రూ.5 లక్షలు ఎటూ సరిపోక ఇబ్బందులు పడ్డాడు. అతని తల్లి బంగారు నగలు అమ్మి, ఇంటిని కుదువ పెట్టి డబ్బు పంపిస్తే గాని శిక్షణ పూర్తి కాని పరిస్థితి. ఆరేళ్లలో నేర్చుకునే అంశాలను ఆర్నెళ్లలో పూర్తిచేసిన ఘనత సాధించాడు. డబ్బు కొరత కారణంగా డిసెంబర్ 2015లో ఇండియాకు తిరిగొచ్చేశాడు. 2016లో జాతీయ ఐస్ స్కేటింగ్‌లో రెండు స్వర్ణాలను తిరిగి సాధించాడు. వింటర్ ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు నిధులు విడుదల చేస్తే శిక్షణ తీసుకుంటానని క్రీడా శాఖను కోరితే గతంలో ఒకసారి నిధులను విడుదల చేశాక మరోసారి ఇవ్వడంలో ఎన్నో అవరోధాలున్నాయని అది సాధ్యం కాదని స్పష్టం చేయడంతో నిరాశకు లోనయ్యాడు. ఒలింపిక్స్‌లో పతకం సాధించడానికి అనుగుణంగా శిక్షణకు గంటకే రూ.6500 వెచ్చించాల్సి వస్తోంది. స్వీడన్‌కు చెందిన 2010 వింటర్ ఒలింపియన్ ఆడ్రెయిన్ చుల్‌థెసిస్ వద్ద వీడియోలో శిక్షణ ద్వారా 30 నిమిషాలకు రూ.2500 ఫీజు చెల్లిస్తూ వచ్చే ఏడాది ఒలింపిక్స్‌కు సిద్ధం అవుతున్నాడు. ఇక మిగతా సమయం ఆన్‌లైన్‌లో వీడియోలను చూసి ట్రైనింగ్ అవుతున్నాడు. దీని కోసం నాలుగు గంటల సమయాన్ని కేటాయిస్తున్నాడు. ఓ పక్క గేమ్‌పై పట్టు సాధిస్తూనే నిధులను సమకూర్చుకునేందుకు ప్రయత్నించాడు. సల్మాన్‌ఖాన్, రణబీర్ కపూర్ తదితరుల సహకారంతో వింటర్ ఒలింపిక్స్‌కు శిక్షణ పొందుతున్నాడు. రాబోయే ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంపైనే నిశ్చయ్ దృష్టి పెట్టాడు. ఆస్ట్రేలియా, పోలెండ్‌ల్లో జూనియర్ గ్రాండ్ ప్రిక్స్ ఫిగర్ స్కేటింగ్‌లోను ఐస్ స్కేటింగ్ టోర్నీలో గెలుపే లక్ష్యంగా బరిలో దిగుతున్నాడు. '2018లో పతకం తేలేకపోయినా నిరాశ చెందను.. 2022 ఒలింపిక్స్‌లోనైనా భారత్‌కు స్వర్ణం అందించి తీరతాన'ని నిశ్చయ్ ధీమా వ్యక్తం చేస్తున్నాడు. అతని దీక్షాదక్షత, పట్టుదల నెగ్గాలని అందరం కోరుకుందాం.

- ఈశ్వర్ నెట్టెం

ఇండెక్స్

సేవ 3
ఢిల్లీ షటిల్

స్టార్........4
నటనే శ్వాసగా

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం...........10
ఇంటి మీద రోడ్డు

తెలుసా............... 11
జన ఘనం

కవిత్వమ్...............14
మా అమ్మ

పుడమి దీపాలు

అట్టమీది కథ...6

గుండమ్మ కథ ఆపాత చిత్రం- 12

కథ 15
అప్పుడే తెల్లారింది

నా కళ్లతో 18
నేను చూసిన చైనా

కొత్త పుస్తకాలు...........20
ఈ యుగం మాది

రుచి......................21
ధనియా ఖీమా మటర్

బాల నేస్తాలు............23
ప్లాస్టిక్ పూలు

పద వికాసం........24

స్వర్ణయుగపు సౌరభం

గత సంచికలో 'ఆ పాత చిత్రం' శీర్షికన మూగ మనసులు గురించి తెలియజేసిన విశేషాలు అలరించాయి. ఆదుర్తి వారి ఆణిముత్యం మూగమనసులు శీర్షికల్లో దాశరథి గారు పేరు రామారావు అని ప్రింటయింది. అయితే పేరు దాశరథి కృష్ణమాచార్యులు. ఈ సినిమాలో కాలేజీ సన్నివేశాలను సరసాపురం వైయన్ కాలేజీలో చిత్రీకరించారు. కోనసీమ ప్రాంతాల్లో గోదావరి అందాలను చిత్రీకరిస్తూ తీసిన చిత్రరాజమది. ఈ సినిమాపై అత్యంత ప్రేమతో సావిత్రి ఆ చిత్రాన్ని తమిళంలో 'ప్రాప్తం' పేరుతో పునర్నిర్మించింది. అక్కడ ఘోర పరాజయం పొందిందీ చిత్రం. అక్కడి నుండి సావిత్రి అప్పుల ఊబిలో కూరుకు పోవడం ఆమె కెరీర్ పరంగా వెనకబడటం జరిగాయనే కథనాలు అప్పట్లో వినపడేవి. 'ఆ పాత చిత్రం' ద్వారా ఇవన్నీ తిరిగి గుర్తుచేసు కోగలిగాం. 'పాడుతా తీయగా చల్లగా పసిపాపలా నిదురపో తల్లిగా ....బంగారు తల్లిగా' అని మనసు కవి ఆత్రేయగారిచే రాయబడిన పాటలో మనసు మూగదే కానీ భాషున్నది దానికి అనే చరణాలు కళ్ళుచెమర్చుతాయి. ఎంతో మంది ఔత్సాహిక గాయకుల గొంతుల్లో ఇప్పటికీ ఈ పాట వినిపిస్తుండటం పాట ఔచిత్యానికి నిదర్శనం.

– అలంకారం విజయ్‌కుమార్,
కందుకూరు.



అబ్బురపరిచాయి

ఆదివారం అనుబంధం స్నేహలో ప్రచురించిన 'ఆ రెండు కళ్లతో' ప్రేమకథా చిత్రం ద్వారా అభిమానులకు దగ్గరయిన నటి నందిత పరిచయం బావుంది. అట్టమీది కథ ద్వారా ఈద్ ముబారక్ నెల రోజులపాటు ఉపవాస దీక్షలు చేస్తూ ఖురాన్ చదువుతూ మసీదుల వద్ద గంజి తయారుచేసుకొని పంచడం ఎక్కువగా సేమియా చేసుకొని ఇరుగుపొరుగు వారితో కుటుంబ సభ్యులతో హలీం వంటకాలు తయారు చేసుకొని అందరికీ పంచడం ఆనందాన్ని పంచుకునే అంశాలు అబ్బురపరిచాయి. రంజాన్ నెలలో వీధుల్లో హలీం, కొన్ని ప్రత్యేకవంటకాలు నోరూరించాయి. ఈ వారం స్నేహ సూపర్ 'వింతలోకం'లో ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఆహారాన్ని అమ్ముతున్న తీరు, ఎండలో చికెన్ కథనాలు బాగున్నాయి. 'ఆ పాత చిత్రం' 'మూగమనసులు' ద్వారా కొత్త విషయాలు తెలుసుకున్నాం. 'బాలనేస్తాలు'లో నీడతో బొమ్మ బాగుంది. చివరి పేజీలో రంగులగొడుగులు, వర్షంలో కప్పలు తడవకుండా వాటి ఆచ్ఛాదనలతో ఉన్న ఫొటోలు చాలా బాగున్నాయి.

– అనుపోజు సంతోషీ నాగరాజు,
విజయనగరం.

గొడుగు వీధుల్లో

స్నేహ చివరి అట్టపై వానచినుకుల్లో ప్రకృతి చాటున తలదాచుకున్న జంతువుల చిత్రాలు, గొడుగు పట్టిన వీధుల చిత్రాలు అబ్బురపరిచాయి. ఉల్కాలోకం, 'ఆ పాత చిత్రం' మూగమనసులు, హ్యాకథాన్ వీరుడు, స్టైల్‌తో అమ్మేస్తున్నాడు బాగున్నాయి. నవ్వుల్ పువ్వుల్ నవ్వు తెప్పించాయి.

– హిమబిందు, విజయవాడ.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ఢిల్లీ షటిల్

నగరాల్లో కాలుష్యం రోజురోజుకీ ప్రమాదకరస్థాయికి చేరుకుంటోంది ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఆక్సీజన్‌ని డబ్బులిచ్చి కొనుక్కుంటున్నారంటే కాలుష్యం తీవ్రత ఎంతనేది అర్థం చేసుకోవచ్చు. అసలు ఇలాంటి పరిస్థితులకి కారణం నగరాల్లో రోజురోజుకీ పెరుగుతులన్న వాహనాలే అనేది ఒక నివేదిక ఢిల్లీలో ఇప్పటికే ఈ కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరిపోయింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యుహెచ్‌వో 2014 నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా అత్యంత కాలుష్య నగరాల్లో మొదటి స్థానంలో వుంది మన దేశ రాజధాని ఢిల్లీ. ఇలాంటి పరిస్థితుల్లో మార్పు తెచ్చేందుకు షటిల్ మినీ బస్ ఆలోచనతో ముందుకొచ్చారు ఢిల్లీకి చెందిన ఇద్దరు ఐఐటి పూర్వ విద్యార్థులు. ఆ వివరాలేంటో మీరూ తెలుసుకోండి.



ఢిల్లీకి చెందిన అమిత్ సింగ్, దీపాంశు మాల్వియా ఇద్దరూ ఐఐటి కాన్పూర్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. దేశంలోనే పేరొందిన ఒక ఈ కామర్స్ కంపెనీలో మేనేజింగ్ విభాగంలో ఉద్యోగం దక్కింది ఇద్దరికీ. వేలల్లో జీతం. జీవితంలో ఒక్కొక్కరిదీ ఒక్కో లక్ష్యం. డబ్బు సాధించడం ఒకరి కలైతే మరొకరికి పేరు పరపతిని పొందడం, అందరికంటే భిన్నంగా ఏదో ఒకటి చేయాలనేది ఇంకొందరి తపన. డబ్బులు సంపాదించి ఒక సొంత కంపెనీ మొదలు పెట్టాలని అనుకున్నాడు అమిత్ సింగ్. ఈ కామర్స్ కంపెనీలో పనిచేస్తున్న సమయంలో కస్టమర్స్ ఆర్డర్స్‌ని అందించడంలో టైమ్‌సెన్స్‌తో పాటు కస్టమర్ల అవసరాలనీ తెలుసుకోగలిగాడు. ఢిల్లీ లాంటి నగరంలో తక్కువ సమయంలో కాస్త సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కోరుకునే వారు ఎక్కువనే విషయం అర్థమయ్యింది తనకి. అప్పుడే సొంతగా ఓ ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్‌ని మొదలు పెట్టాలనే ఆలోచన తట్టింది ఇద్దరికీ. అప్పటికే నగరంలో వోలా, ఉబెర్ సేవలు ఊపందుకున్నాయి. అలాంటి పరిస్థితుల్లో రవాణా రంగంలో ప్రయివేటు వాహనాల పోటీని తట్టుకొని నిలబడడం అంటే అంత తేలికేంకాదు. అలాంటి పరిస్థితుల్లో అమిత్‌కి ఓ కొత్త ఆలోచన మొదలయ్యింది. మనదేశంలో తమలాంటి యువతంతా వ్యాపారం, డబ్బు గడించడం వైపే దృష్టిపెడుతోంది. అయితే సామాజిక సమస్యలనీ పరిష్కరించే దిశగా ఒక కొత్త ప్రాజెక్ట్‌ని మొదలుపెట్టాలనుకున్నాడు అమిత్. ఢిల్లీలో అప్పటికే వందల సంఖ్యలో క్యాబ్ సర్వీసులన్నీ ప్రయాణీకులకి చాలా అందుబాటులో ఉన్నా యి. అయితే ఢిల్లీ వాసులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కాలుష్యం. ఈ కాలుష్యాన్ని తగ్గించాలంటే వాహనాలని తగ్గించి ఎక్కువమంది ప్రయాణించేలా చేయాలనే ఆలోచన తట్టింది. అలా ఎక్కువమంది ప్రయాణీకులు ఒకేసారి ప్రయాణించేలా ఏప్రిల్ 2015లో షటిల్ మినీ బస్ సేవలు మొదలయ్యాయి. అందుకోసం 20 నుండి 40 సీట్లు కలిగుండే వాహనాలని అద్దెకు తీసుకున్నారు. ఇప్పుడు ప్రయాణీకులని ఎంచుకోవడం వీళ్ళ లక్ష్యం ఎందుకంటే ఈ సేవలన్నీ మామూలు క్యాబ్ సర్వీసుల్లా కాదు. ప్రయాణంతో పాటు కాలుష్యాన్నీ వీలైనంతగా తగ్గించడమే ఈ సేవల ముఖ్య ఉద్దేశం. అందుకోసం నెలలో దాదాపు 20 రోజులు ట్యాక్సీల్లో ప్రయాణించేవారి వివరాలను సేకరించారు. అలాంటి వారిని కలిసి కాలుష్యంపై అవగాహన కల్పించడంతోపాటు షటిల్ సేవలని వినియోగించుకునేలా చేయడానికి కాస్త సమయం పట్టింది. అన్నింటికంటే మార్కెట్‌లో అప్పటికే వున్న వాహనాల పోటీని తట్టుకుంటూ ఇలాంటి సేవలు చేయడం పెద్ద సవాలులా నిలిచింది. అయితే ఇలాంటి వాటిని పక్కన పెట్టి ఢిల్లీలోని అత్యంత కాలుష్య ప్రాంతాల్లో అవగాహనా సదస్సులని నిర్వహించేవారు. అలా కొన్నాళ్ళకి షటిల్ సేవలు ఎక్కువ మందికి చేరువ కాగలిగాయి. ప్రయాణీకులకి ఎలాంటి అసౌకర్యం లేకుండా వుండేలా విశాలమైన సీటింగ్‌తో పాటు తగినంత గాలి, వెలుతురు చొరబడేలా రూపుదిద్దారు. టికెట్ చార్జీలు కూడా కాస్త తక్కువే కావడంతో సామాన్యులకి కూడా ఇవి చేరువయ్యాయి. ఇక తర్వాతి ప్రాజెక్ట్ సొంతకార్లలో వెళ్ళే వాళ్ళని సైతం ఇలా ఒకే బస్సులో ప్రయాణించేలా చేయడం. మొదట్లో అమితాబ్ దీపాంశులకి ఇది తలపట్టుకు నేలా చేసింది. అయితే పర్యావరణ పరిరక్షణపై పదే పదే అవగాహన కల్పించడంతో కొంతమంది ఈ బస్సుసేవలని ఉపయోగించు కునేందుకు ముందుకురావడం ఓ మంచి పరిణామం.. ప్రస్తుతం ఢిల్లీలోని వివిధ మార్గాల్లో 75కు పైగా సాధారణ బస్సులతోపాటు 450 ఎసి బస్సులు నడుస్తున్నాయి. రోజుకి 300 పికప్ పాయింట్స్‌తో దాదాపు 20000 సార్లు నగరంలో షటిల్ బస్సుసేవలని నిర్వహిస్తున్నారు. అలా ఢిల్లీలో కాలుష్య తీవ్రతని తగ్గించడంలో వీళ్ళు కృషి మంచి ఫలితాల నిచ్చింది. 2016 నాటికి కాలుష్య కారక నగరాల్లో ఢిల్లీ పదకొండవ స్థానానికి చేరుకుందంటే వీళ్ళ కృషి కూడా ఉందనేది కాదనలేం.

- శర్వాణి

నటనే శ్వాసగా

మలయాళ ప్రేక్షకులకి పరిచయం అవసరం లేని పేరు మంజిమా మోహన్. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కూతురుగానే కాదు బాలనటిగా, డ్యాన్సర్‌గా కూడా మంచి పేరుతెచ్చుకుంది. హీరోయిన్‌గా అరంగేట్రం చేసిన రెండేళ్ళలో మహిళా ప్రాధాన్య చిత్రాలతో మలయాళం, తమిళం, తెలుగు చిత్రసీమల్లో తనకంటూ ఒక కొత్త ఇమేజ్‌ని దక్కించుకున్న మంజిమా పరిచయం మీ కోసం....

1993 ఏప్రిల్ 11న కేరళలోని త్రివేంద్రంలో పుట్టింది.

- మలయాళ సినిమాటోగ్రాఫర్ విపిన్ మోహన్, ప్రముఖ డ్యాన్సర్ కళామండలం గిరిజ తల్లిదండ్రులు.
- నిర్మల భవన్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో చదువుతున్న రోజుల్లోనే చైల్డ్ ఆర్టిస్ట్‌గా మలయాళంలో అవకాశాలు దక్కాయి.
- అలా 1998లో అనిల్ బాబు దర్శకత్వంలో వచ్చిన 'కలియోన్జల్' మలయాళ చిత్రంలో చిన్నారి అమ్ము పాత్రలో తెరపై కనిపించింది. ఆ చిత్రం హీరో మమ్ముటి చెల్లెలు గౌరి (అమ్ము) చిన్న నాటి పాత్ర అది. మొదటి చిత్రంలోనే నటనలో ఎంతోమంది సినీప్రముఖుల ప్రశంసలు అందుకుంది. అలా అదే సంవత్సరం 'మయిల్ పేలిక్కవు' చిత్రంలో నటించే అవకాశం దక్కింది.
- ఆ తర్వాత 'సాఫల్యం', 'ప్రియమ్', 'తెన్కసిపట్టణం', 'మధురానొంబరకట్టు', 'సుందర పురుషన్, 'తాండవమ్' చిత్రాలు మంజిమాకి చైల్డ్ ఆర్టిస్ట్‌గా వరుస విజయాలని అందించాయి.
- 'ప్రియమ్' చిత్రంలో అను పాత్ర ద్వారా మలయాళ ప్రేక్షకులకి మరింత దగ్గరైపోయింది మంజిమా. బాలీవుడ్ చిత్రం 'హమ్ హైన్ రాహీ ప్యార్‌కే' రీమేక్ చిత్రం 'ప్రియమ్' నిజానికి మంజిమా సినీ ప్రస్థానంలో ఒక మైలురాయి.
- మలయాళ ప్రముఖ దర్శకుడు కమల్ దర్శకత్వంలో మంజిమా నటించిన చిత్రం 'మధురానొంబరకట్టు'. 2000లో విడుదలైన ఈ చిత్రానికిగాను ఉత్తమ బాల నటిగా కేరళ స్టేట్ ఫిల్మ్‌ఫేర్ అవార్డుని అందుకుంది.
- ఆ తర్వాత ఫిల్మ్ కెరీర్‌కి కాస్త బ్రేకిచ్చింది.
- చెన్నయ్‌లోని స్టెల్లా మేరిస్ కాలేజీలో బియస్సీ మ్యాథమెటిక్స్ పూర్తి చేసిన తర్వాత తన ధ్యాసంతా చదువుపైనే.... సినీ రంగంలో రీ ఎంట్రీ ఆలోచన చేయలేదు.
- పద్నాలుగేళ్ళ తర్వాత 'ఒరు విడక్కుమ్ సెల్ఫీ' మంజిమా జీవితాన్ని మలుపు తిప్పింది.
- 2015లో మలయాళ చిత్రసీమలో సంచలన విజయం సాధించిన చిత్రమిది. ఈ చిత్రం కోసం మొదట కొందరు ప్రముఖ నాయికల పేర్లు వినిపించాయి. అయితే దర్శకుడు ప్రజిత్ మాత్రం మంజిమాని అనుకున్నాడు.
- అలా కామెడీ థ్రిల్లర్ చిత్రం 'ఒరు విడుక్కుమ్ సెల్ఫీ' ద్వారా హీరోయిన్‌గా అరంగేట్రం చేసింది మంజిమా. నివిన్ పాలీతో కలిసి నటించిన ఈ చిత్రంలో తను చేసిన డెయిసీ పాత్ర కోసం ఎనిమిది కేజీల బరువు తగ్గింది మంజిమా. ఫేస్‌బుక్ లవ్ థీమ్‌లో వచ్చిన ఈ చిత్రంలో తన నటన చాలా డెడికేటివ్‌గా వుంటుంది.
- బాక్సాఫీస్ హిట్‌తో పాటు ఆ సంవత్సరం అత్యధిక వసూళ్ళు చేసిన 'ఒరు విడుక్కు సెల్ఫీ' తన కెరీర్‌లో హిట్ చిత్రంగా నిలిచిపోయింది.
- 'ఒరు విడుక్కు సెల్ఫీ' చిత్రంలో మంజిమా నటనకి ఇంప్రెస్ అయిపోయిన గౌతమ్ మీనన్ తన చిత్రంలో అవకాశం ఇచ్చాడు.
- అలా 'సాహసమ్ శ్వాసగా సాగిపో' చిత్రం ద్వారా 2015లో తెలుగు చిత్రంలో నటించే అవకాశం దక్కింది.
- తర్వాత గౌతమ్ మీనన్ దర్శకత్వంలో 'అచ్చమ్ ఎన్నాదు మదమయ్యాద' తమిళ చిత్రంలో నటించింది. ఈ చిత్రానికి ఫిల్మ్ ఫేర్ అవార్డుని సొంతం చేసుకుంది.
- 2017 జూన్‌లో విడుదలైన 'నిరంజన' చిత్రంలో మహిళా ప్రాధాన్య పాత్రలో మంజిమ నటనకి మంచి మార్కులే దక్కాయి.
- ప్రస్తుతం 'ఇప్పడాయ్ వెల్లుమ్' తమిళ చిత్రంతో పాటు మరో మలయాళ చిత్రంలో నటించనుంది. నటనతోపాటు డ్యాన్సర్‌గా పేరుతెచ్చుకున్న మంజిమాకి మరిన్ని అవకాశాలు రావాలని కోరుకుందాం.

★

శాంతి

నవ్వుల్ - పువ్వుల్

స్నేహం కోసం

రెండు బొద్దింకలు ఇలా మాట్లాడుకుంటున్నాయి...

మొదటి బొద్దింక: ప్రేమ కోసం మనుషులు మందు తాగుతారట. మరి మన ఫ్రెండ్షిప్ కోసం నువ్వూ ఏదైనా తాగొచ్చుగా...

రెండో బొద్దింక : ఏం తాగాలి?

మొదటి బొద్దింక : డోమెక్స్ తాగితే చాలు.....

రెండో బొద్దింక : ఆ........!!



షాక్

డాక్టర్ : రేపు ఆపరేషన్ చేయాల్సిన పేషెంట్ అలా పరెగెత్తుకుంటూ వెళ్ళిపోతున్నాడు ఏంటి సిస్టర్....??

సిస్టర్ : ఆపరేషన్ అయ్యాక ఏం చేస్తారని అడిగితే........ మీ బంధువులకి అప్పగిస్తామని చెప్పా డాక్టర్... ....అంతే.....!!

వంటల పుస్తకం

రవి : వండినవన్నీ అలా పడేయకపోతే బయట ఎవరన్నా ఆకలితోవున్న వాళ్లకి ఇవ్వొచ్చుగా.

హరి : నిన్న అదే చేశాను...... భోజనం తీసుకున్న వాడు ఇవాళ వచ్చి నాకు వంటల పుస్తకాన్ని ఇచ్చెళ్ళాడు.

రవి : ఆ..............

క్రిములు

టీచర్ : టర్కీ వాళ్లని టర్క్స్ అని పిలుస్తారు. మరి జర్మనీ వాళ్లనూ...

బంటీ : నాకు తెలుసు టీచర్..

టీచర్ : ఏమంటారు?

బంటీ : జెర్మ్స్ ...

కిసుక్కు సిత్రం



బాహుబలి ఉంటే బాగుండు...

కిసుక్కు

చంటి : నాన్న మూఢనమ్మకం అంటే ఏంటి??

తండ్రి : నువ్వు ఈసారైనా పాసవుతావని నేను అనుకోవడం.

కలరింగ్

చింటు : ఒరేయ్.... ఈ విమానమ్ ఇంత పెద్దదిగా వుంది కదా... దీనికి కలర్ వేయడం చాలా కష్టం కదా...!

బంటి : అబ్బే అదేం లేదురా.... చాలా వీజీగా వేసేస్తారు!.

చింటు : అవునా అదెలా.....!!

బంటి : విమానం పైకెళ్ళగానే చాలా చిన్నదిగా వుంటుంది కదా...అప్పుడు రంగుల డబ్బాలో ముంచేస్తారు అంతే.....



కోడి

రాజు : రేపు నా పుట్టిన రోజు ఒక 15 ఏళ్ళ కోడిని తీసుకువస్తే కోసి వండుకు తింటే బావుంటుంది కదరా...

రవి : ఒరే మరి నీకు 40 ఏళ్లు వస్తే అప్పుడేంటి పరిస్థితి.

రాజు : ఏ అప్పటి వరకూ బతికి ఉండదా..!



నాకు నచ్చిన చిత్రం

సేకర్త - పి. బాలు, గుణదల

పుడమి దీపాలు



- అజయ్ కుమార్ వారాల
9502395077

జులై 12 'మలాలా డే' సందర్భంగా...

ఇంటికి దీపం ఇల్లాలు అనే తరం పాతబడి పోయింది. పుడమికే దీపం ఆడపిల్ల అనే నేటి తరం కొత్త వెలుగులు ప్రపంచపు అజ్ఞానపు తిమిరాల్ని జ్వలించేస్తున్నాయి. కట్టుబాట్ల చీకట్లను, వివక్షల నిశిరాత్రులను చీల్చేస్తున్నాయి. ఆడపిల్ల అంటే ఇప్పుడో ఉద్యమం... యువతి అంటే ఇప్పుడో స్ఫూర్తి కిరణం. మనకు మలాలా తెలుసు. ఆమె వ్యథ తెలుసు.. కథ తెలుసు. బాధిత... విజేత... స్ఫూర్తిప్రదాత... పరిణతి తెలుసు. 'ఐయామ్ మలాలా' అంటూ ప్రపంచానికి బాగా పరిచయమైన ఈ విప్లవం ప్రపంచమంతా ఆడపిల్లల చైతన్యంగా ఉద్యమించిన తీరు తెలుసు. మలాలాకు నోబెల్ వచ్చింది. మలాలా పేరిట దినోత్సవం వచ్చింది. ఈ రెండింటినీ మలాలా యూసఫ్‌జాయ్ గర్వంగా చేతినెత్తుకోలేదు. యువతీ ప్రపంచమంతా సగర్వంగా తలెత్తుకుంది. అవును ఇప్పుడు మలాలా అనే పదం ఒక యువతి పేరుగా కాక ఆడపిల్లల చైతన్యానికి మారుపేరుగా మారిపోయింది. మలాలా లాంటి ఎందరో అమ్మాయిలు ప్రపంచాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఆ పుడమి దీపాల గురించే ఈ వారం అట్టమీది కథ.

పోప్ అమెరికాలో పర్యటిస్తున్న సందర్భంలో ఇమ్మిగ్రేషన్‌పై భయాందోళనలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడికి ఈ విషయంలో పోప్ మాత్రమే మంచి చెడు చెప్పగలడనే కాస్త ఆశ అక్కడ నెలకొంది. పెద్దలు కొన్ని రోజులుగా మాట్లాడుకుంటున్న ఈ విషయాలు సోఫీ క్రజ్ అనే చిన్నారి మనసులో నాటుకుపోయాయి. వారింట్లోనే వలస సమస్య అంత తీవ్రంగా ఎందుకుందంటే సోఫీ తల్లిదండ్రులు సరైన పత్రాలు లేకుండా అమెరికాలోకి వచ్చి పనులు చేసుకుంటున్న చాలామంది మెక్సికన్లలో ఒకరు. ఇలాంటివి 11 మిలియన్ కథలు అమెరికాలో ఉన్నాయి. తన తల్లిదండ్రుల్ని బలవంతంగా దేశంలోంచి తరిమేస్తే తన పరిస్థితేంటని ఆ చిన్నారి మనసుకు బలంగానే అనిపించింది. అందుకే తెగించి ర్యాలీగా వెళుతున్న పోప్ కారుకు అడ్డంగా వెళ్లబోయింది. భద్రతా సిబ్బంది సోఫీని అడ్డుకోగా ఈ విషయాన్ని గమనించిన పోప్ కారు దిగి ఆ బాలికను ఎత్తుకున్నాడు. ఆమె నుంచి విజ్ఞాపన పత్రాన్ని తీసుకున్నాడు. ఆమె ధరించిన టీ షర్ట్ మీద స్పానిష్‌లో రాసి ఉన్న 'పాపా రెస్కేట్ డాపా' అనే నినాదాన్ని చదివాడు. ఆ తర్వాతి రోజే యునైటెడ్ స్టేట్స్ కాంగ్రెస్‌లో ఇమ్మిగ్రేషన్ సమస్యలపై దయతో వ్యవహరించండని అమెరికాను కోరాడు. కొన్ని రోజులకే అప్పటి అధ్యక్షుడు బరాక్ ఒబామా సోఫీని పిలిపించి విషయం గురించి మాట్లాడాడు. ఓ లోహ పరిశ్రమలో తన తండ్రి ఎంత కష్టపడుతోంది, తన



సోఫీ క్రజ్

మన మలాలా

ఇష్టం లేకున్నా బాల్య వివాహం చేస్తే ఏ ఆడపిల్ల అయినా మా అంటే ఏం చేస్తుంది. అలిగి అన్నం తినడం మానేస్తుంది. నాలుగు రోజులు చీకటి గదిలోనే ఒంటరిగా ఏడుస్తుంది. సార్..! ఇట్టే ఈ కబుర్లు చెప్పి తంతు కానిచ్చేయకండి. మీరు మంపీ ఖటూన్ పేరు ఇక నుంచి మర్చిపోరు. ఏకపక్షంగా విడాకులిచ్చే విషయంపై నోరు పెగలని అమ్మాయి కాదు ఆమె. అదే తీరుతో ట్రిపుల్ తలాఖ్ చెప్పి చదువుకు వెళ్తానన్న తెగువ ఈ 16 ఏళ్ల ఆడపిల్లది. ఇంకా కోర్టు కేసులోనో, పెద్దల తర్జనభర్జనల్లోనో విషయం నలుగుతుంటే... తానే ఆ మాటల్ని గుండెల్లోకి తీసుకుని తిరగబడిన మామూలు అమ్మాయి మంపీ ఖటూన్. కోల్‌కతాకు 55 కి.మీ.ల దూరంలో ఉండే మల్లిక్‌పూర్ మందిర్ బజార్‌లో ఓ టీ కొట్టు నడపుతుంటాడు మంపీ తండ్రి సర్జుల్ ఘరామీ. ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు కొడుకులు కావడంతో పెళ్లిళ్లు చేసి బాధ్యతలు తీర్చేసుకోవాలనే అనుకున్నాడు కానీ అంతకు మించి ఆలోచించలేదు. కూతురు మంపీ అప్పుడు 9వ తరగతి చదువుతోంది. తండ్రి బాధ అర్థం చేసుకునే ఓ షరతు మీద పెళ్లికి సరేనంది. అదేంటంటే అత్తింటివాళ్లు తను చదువుకునేందుకు ఒప్పుకోవాలి. సరే బిడ్డా అంటూనే ఆమెను తమ గడప లోపలికి తీసుకెళ్లారు. కానీ చదువు అనే మాట కూడా రానంత బండెడు పనిని మీదేశారు. తీరికలోనే మాధ్యమిక పరీక్షల్లో గట్టెక్కింది. కానీ అంతకు ఒక్క తరగతి కూడా చదివేందుకు కూడా కుదరదని భర్త తెగేసి చెప్పాడు. ఈ విషయం నడుస్తుండగానే ఆమె పుట్టింటికి వచ్చింది. అక్కడే ఉండి చదువుకోవాలని నిర్ణయించుకుంది. ఈసారి తండ్రి అర్థం చేసుకున్నాడు. తానే దగ్గరుండి దగ్గరలోని కృష్ణచంద్రపూర్ ఉన్నత పాఠశాలలో చేర్పించాడు. ఈ విషయం ప్రధానోపాధ్యాయుడు చందన్ కుమార్ మూర్తికి సంతోషం కలిగించింది. ఆ సంతోషాన్ని కాస్త మంపీ కుటుంబానికీ పంచాడు ఫీజులు తగ్గించి. కానీ ఈ విషయం అత్తింటికి అస్సలే మాత్రం నచ్చలేదు. ఓ రోజు సర్జుల్ ఇంటి మీద పడి నానా యాగీ చేశారు. కూతుర్ని అలాంటి ఇంటికి తిరిగి పంపే ఆలోచనలేవి ఇక తట్టలేదు సర్జుల్‌కు. కానీ వారికి సమాధానం చెప్పే అవకాశం లేక కుదేలైతే... ఇంటి ఆడపిల్ల ఆగ్రహంగా బయటకు వచ్చింది. నలుగురిలో గొంతెత్తింది.. పెద్దలను ఎదిరించింది... కన్నీటితో పాటు తలాక్ తలాక్ తలాక్ అనే పదాలు కూడా విసిరికొట్టింది. అంత చైతన్యాన్ని తట్టుకునే దమ్ము అత్తింటికి ఉందా...! తల్లి సహేరా బేగం మనస్సు ఉప్పొంగింది కూతురి ధీరత్వాన్ని చూసి. ఇక తండ్రి సర్జుల్ కూడా ఎక్కడ మండిపడతాడోనని పలాయనం చిత్తగించారు వాళ్లు. సమాజం షాకైంది. ఆడపిల్ల తలాఖ్ చెప్పడేమంటని నోరెళ్లబెట్టింది. షరియా ప్రకారం స్త్రీ విడాకుల కోసం ఖులా ద్వారా పెద్దలకు విన్నవించుకోవచ్చు. కానీ ఇలా తలాఖ్ చెప్పకూడదంటూ కొందరు అన్నారు. ఇలా చేయడం సాహసమే కానీ, రోజులు మారాయి.. ఆడపిల్లను అర్థం చేసుకోవాలి అని మరికొందరు అంటున్నారు. మంపీ మన మలాలా అని కొందరు అంటున్నారు. కానీ మలాలా ఇప్పుడు ఓ పాకిస్థానీ కాదు చైతన్యానికి మారు పదం. ఎవరేమనుకున్నా మంపీది ఒకటే ఆకాంక్ష, లక్ష్యం బాగా చదువుకోవాలి. చదువుల వెలుగులు సమాజానికి పంచాలి. పుడమికి ఓ దీపం కావాలి.

తండ్రిలానే మిగతా మెక్సికన్ వలసదార్లు శ్రమిస్తోంది.. తన తల్లి కష్టమేంటి... అమ్మానాన్నలతో తాను ఎలా కలసి బతకాలనుకుంటోందనే విషయాలపై ఆమె ప్రసంగాలు చాలామందిని ఆలోచింపజేశాయి. చివరకు డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా ఈ యేట సాగిన 'వుమెన్స్ మార్చ్'లో కూడా ఈ బాలిక అద్భుతమైన ప్రసంగాన్ని స్పానిష్‌లోను ఇంగ్లిష్‌లోను ఇచ్చి చైతన్యానికి కరదీపికగా పేరు సంపాదించింది. ఈ పుడమి దీపం నడక ఇలా ఉంటే మరో చైతన్యం తమను నిందించే 'స్లట్‌వాక్' పేరిట ప్రపంచాన్నే ఊపేసింది. 2011లో కెనడాలోని యార్క్ విశ్వవిద్యాలయంలో జరిగిన క్యాంపస్ రేప్ గురించి మాట్లాడుతూ ఒంటారియో పోలీసులు 'అమ్మాయిలు వేశ్యల్లా వస్త్రాలను ధరించి వీధుల్లో తిరగకండి' అని ఇచ్చిన స్టేట్‌మెంట్‌తో ఈ ఉద్యమం రోడ్డెక్కింది. లైంగిక దాడులకు గురైన అమ్మాయిల్ని వేధించడం, వారిని అవమానకర రీతిలో పేర్లు పెట్టి ఎగతాళి చేయడం, వేసుకునే దుస్తుల నుంచి నడిచే తీరు వరకు ప్రతిదీ రేప్ చేయమన్నట్టే ఉందని అటాకర్లు తమను తాము సమర్థించుకోవడం అనేది కెనడాలోనే కాదు ప్రపంచమంతా ఉన్నదే.. ఈ నీచత్వానికి వ్యతిరేకంగానే 'స్లట్‌వాక్' ప్రపంచంలోని ముఖ్య నగరాల్లో వీధికెక్కి మార్చ్ చేసింది. ముఖ్యంగా ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొంది టీనేజర్లే. తమపై జరుగుతోన్న లైంగిక దాడులపై నోరు మెదిపితే అవమానానికి గురవుతామని అనుకున్న వారు సైతం పబ్లిక్‌గా 'మేం రేప్‌కు గురయ్యాం' అని నినదించిన తీరే చెబుతుంది ఎంత చైతన్యానికి 'స్లట్‌వాక్' కారణమైంది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది యువతులను, మహిళలతో ఓ మహా ఉద్యమాన్నే నడిపించిన ఈ 'స్లట్‌వాక్'ను రోడ్డెక్కించింది ఇద్దరు యువతులంటే అస్సలు నమ్మలేం. విశ్వవిద్యాలయంలోని రేప్ కేసును దగ్గరి నుంచి గమనిస్తోన్న సోన్యా బార్నెట్, హెథర్ జార్విస్‌లు తమ వెబ్‌సైట్, సామాజిక మాధ్యమాల ద్వారా ఉద్యమానికి తెరతీశారు. 'స్లట్' అనే పదాన్ని సొంతం చేసుకుని నిరసన కార్యక్రమాల్ని మొదలెట్టారు. ఇప్పటికీ 'స్లట్‌వాక్' నడుస్తూనే ఉంది. ఇప్పుడు 'స్లట్' అనే పదానికి అర్థం కూడా మారిపోతోందీ ఈ పుడమి దీపాల వల్ల.



హెథర్ జార్విస్

వీధి పేరు ఆడపిల్ల

జురీ గ్రామం గురించి ఇంతకు ముందే చదువుకున్నాం. జార్ఖండ్‌లోని ఈ గ్రామంలో వీధి పేర్లకు ఆడపిల్లల పేర్లే పెడతారు. గ్రామంలోని ఆడపిల్లలు 30 కి.మీ.ల దూరంలోని కళాశాలలకు వెళ్లొస్తూ చదువుల వెలుగులు గ్రామంలోను ఆ ప్రాంతంలోను పంచుతున్నారు. ఇవి రాజకీయ నాయకులు తిరిగిస్తోన్న వెలుగుల కన్నా చాలా ఎక్కువ. అందుకే అక్కడ రాజకీయ నేతల కన్నా కూడా బాగా చదువుకుని మరికొందరు ఆడపిల్లలకు స్ఫూర్తిగా నిలుస్తోన్న వారి పేర్లే పెడుతున్నారు. సుమితా భట్టాచార్య, బైశాఖి గోపె, మణిమాలా సిఖ్దర్, సునీతా గోపె వంటి వీధుల పేర్లు ఇలా పుట్టినవే.

అమెరికాలో నిప్పు రవ్వ

అమెరికాలో యుక్త వయస్సు ఆడపిల్లలు నడుపుతోన్న ఉద్యమం పేరు స్పార్క్. ఇది అందరి బుర్రల్లో ఆలోచనల్ని వెలిగిస్తోంది. ఇన్నాళ్లు చరిత్ర అంటే తెల్ల తోలు మగాడు చెప్పిందే అని వారికీ అనిపించింది. తమ పాఠ్య పుస్తకాల నుంచి గ్రంథాలయాల ఆర్కైవ్‌ల దాకా మగాడి సాహసం, చరిత్ర భజనల బూజే తప్పిదే చారిత్రాత్మక స్త్రీ శక్తి గురించి తెలిసేది కొంతే అని గమనించారు. అంతే అమెరికాను దాటి వారో సాంకేతిక వెలుగుల్ని ప్రసరింపజేసే పనిలో పడ్డారు. గూగుల్ మ్యాపింగ్ యాప్ 'ఫీల్డ్ ట్రిప్'కు 'వుమెన్ ఆన్ ద మ్యాప్' అనే సాంకేతికత ఉపకరణాన్ని జత చేశారు. మీరు ఏదైనా ప్రదేశానికి వెళితే అక్కడ చరిత్ర సృష్టించిన స్త్రీ శక్తి ఉంటే మీ ఫోన్ బజ్ అవుతుంది. ఆ మహిళ గురించి ఆమె చరిత్ర గురించి సమాచారాన్ని అందిస్తుంది. పుటల్లో మడతబెట్టేసిన స్త్రీ చరిత్రను వెలికితీసి యువతీ శక్తిని జాగృతం చేసే స్పార్క్ ఇది. సంప్రదాయ చరిత్ర నిర్లక్ష్యం చేసిన వనితల కథలకు

ప్రాణం పోసే గొప్ప ప్రాజెక్ట్ ఇది. ఇప్పటికే ఒక్క స్పార్క్‌కే 119 మంది అన్‌సంగ్ షీరోలు బయటకు వచ్చారు.

యూట్యూబ్ రోష్నీ

పరీక్షలంటే భయం పోగొట్టింది రోష్నీ ముఖర్జీ. ఆమె ట్యూషన్ టీచర్ కన్నా ఎక్కువే. ఆమె ట్యూషన్‌కు లక్షలాది మంది హాజరవుతారు. యూట్యూబ్ ద్వారా 9-12 తరగతులకు గణితం, సైన్స్ పాఠాలు బోధించే రోష్నీ 'ఎగ్జామ్‌ఫియర్.కామ్' కూడా నడుపుతోంది. అదే పేరిట ఆమె యూట్యూబ్‌లో 3900 పైగా వీడియోల ద్వారా పాఠాలు నేర్పుతోంది. ఆమె క్లాసులను ఫాలో అయ్యి ఎన్ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులు కూడా ఉన్నారు. ఎటువంటి ట్యూషన్ ఫీజు లేకుండా ఉచితంగా అందరు విద్యార్థులూ ఆమె పాఠాల్ని వినే వీలుంది. 2011 నుంచి ఇలా ఈ ఫిజిక్స్ మాస్టర్స్ పట్టాదారు సేవలు అందిస్తోంది. చిన్నప్పటి నుంచి టీచర్ అవ్వాలని కోరిక ఉన్నా తండ్రి హఠాన్మరణంతో

ఇంటి బాధ్యతల భారం రోష్నీ మీదే పడింది. చదువు తర్వాత వెంటనే ఒకప్పుడు ఓ ఎంఎన్‌సీలో ఉద్యోగం చేసేది. కానీ సమాజానికి ముఖ్యంగా విద్యార్థి లోకానికి ఏదో రకంగా సాయపడాలనే తన ఆకాంక్ష నెరవేరడం లేదని బాధపడేది. చివరకు ఆరు రోజుల వర్క్ షిఫ్ట్ తర్వాత సెలవు దినాన పాఠాల్ని వీడియోల్లో రికార్డు చేసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసేది. చాలా తేలికగా మ్యాథ్స్ ప్రాబ్లమ్స్‌ను పరిష్కరించడంలో దిట్ట అయిన రోష్నీ పాఠాలతో పరీక్షలంటేనే కాదు మ్యాథ్స్ అంటే కూడా భయాన్ని పోగొట్టుకుంటున్నారు విద్యార్థులు. త్వరలో 6-8 తరగతి విద్యార్థులకు కూడా పాఠాల్ని అందుబాటులో తేవాలని ప్రయత్నిస్తోంది. అలాగే ఆంగ్ల భాష మీద మన విద్యార్థులు పట్టు సాధించేందుకు కూడా ఓ ప్రాజెక్ట్‌ను చేస్తోంది. ఇలా రోష్నీ ఒకేసారి లక్షల మందికి టీచరమ్మ అయిపోయింది. బ్రైట్ స్టూడెంట్లని తయారు చేస్తున్నాయి ఈ పుడమి దీపం వెలుగులు.

పచ్చటి వెలుగు

పర్యావరణ పరిరక్షణ కోసం పనిచేస్తున్న 'గ్రీన్ హోప్' భూమికి శ్వాసనిస్తోంది. నేలంతా అయిన గాయాలకు అంతోఇంతో మందు వేస్తోంది. 10 దేశాల్లో 10 వేల మంది బాల కార్యకర్తలతో నడిచే ఈ స్వచ్ఛంద సంస్థకు ఖకాషన్ బసు నాయకి. 12 ఏళ్లకే పుడమి తల్లి సేవకు అంకితమైన బసు ముఖ్యంగా మడ అడవుల సంరక్షణ కోసం కృషి చేస్తోంది. మొక్కలు నాటడం నుంచి బీజం పడిన ఆమె పచ్చని సేవ ఇప్పుడు ఎన్నో పర్యావరణ అద్భుతాలకు కారణమైంది. కోల్‌కతాలోని తన బామ్మ ఇంటి మీదే తోటను పెంచడం ఆ పసిమనసును ఎంతో ఆశ్చర్యానికి గురి చేసింది. మొక్కలు, చెట్ల మధ్య తిరుగుతుంటే ప్రకృతి మాత ఒడిలో ఆడుకున్న అనుభూతి ఆ ఆడపిల్లను పుడమి దీపంగా మార్చింది.

ర్యాప్‌స్టార్ కాంతి రేఖ

పదేళ్లకు ఆఫ్ఘన్ బాలిక సోనితా అలీజాదేను వాళ్లమ్మే పెళ్లి పేరిట అమ్మేద్దామనుకుంది. ఆమె కూడా 13 ఏళ్లకే అలా అమ్మేయబడిందిమరి. కానీ అనుకున్నంత బేరం కుదరలేదు. మళ్లీ సోనితాకు పదహారేళ్లు వచ్చాక అటుఇటుగా 50 వేలు ఇస్తామని ఎవరో ముందుకొచ్చారు. అప్పుడూ అమ్మ

నికరాగువా కాంతి పుంజం

మరియా ఫెర్నాండా పినెడా కలెరో ఇప్పుడో సాధారణ అమ్మాయి పేరు కాదు. ఇదో ఉద్యమం. పురుషాధిక్యతతో నలిగిపోతున్న అక్కడి మహిళ ఎప్పటికీ మైనరే అని స్టేట్‌మెంట్ ఇచ్చింది ఈ యువ సంచలనం. ఆ మాటతోనే ఆగలేదు 'మా జీవితాల్ని మమ్మల్ని బతకనివ్వండి' అంటూ ఓ కొత్త నినాదాన్ని నికరాగువా మహిళకే కాదు మైనరైన యువతులకు అందించింది. లాటిన్ అమెరికాలోని ఫెమినిస్ట్ ఉద్యమాల గడ్డ అయిన నికరాగువాలో ఇప్పటికీ పరిస్థితిలో అంత మార్పేం లేదు. ఇంకా చెప్పాలంటే ఈ మధ్య మహిళలు, యువతుల మీద హింస తారాస్థాయికి చేరుతోంది. అలాంటి సందర్భంలో 'నేను ఫెమినిస్ట్'ని అనే మాట ఎవరి నోటన్నా వచ్చిందంటే దానికి టన్నుల కొద్దీ దమ్ము ఉండాలి. మరియా ఫెర్నాండాకు అది అంతకన్నా ఉంది. 16 ఏళ్ల ఈ అమ్మాయి సాకర్‌ను ఎంత ఇష్టంగా ఆడుతుందో... పాప్ మ్యూజిక్‌కు ఎంత బాగా డ్యాన్స్ చేస్తుందో అంతే ప్రాణం పెట్టి ఫెమినిస్ట్ ఉద్యమాన్ని నడుపుతోంది. లైంగిక, పునరుత్పత్తి అంశాలపై మహిళలకు హక్కులుండాలని పోరాడటమే కాదు మిగతా యువతుల్లో కూడా చైతన్యం తెస్తోంది. 'బార్న్ టు ఫ్లై' ఎగిరేందుకే పుట్టామనే అర్థమొచ్చే ఉద్యమానికి ఆమె నాయకత్వం వహిస్తోంది. గ్రామీణ ప్రాంతాల యువతులకు లైంగిక-పునరుత్పత్తి హక్కులు, పౌర హక్కులపై అవగాహన కలిగించే వర్క్‌షాపుల్ని నడిపిస్తోంది. యూత్ క్యాంపులు, ఫోరమ్‌లను ఏర్పాటు చేస్తూ వెలుగుల్ని నికరాగువా అంతటా వ్యాపింపజేస్తోంది. ఒలింపిక్స్ బేటన్ ఎలా అయితే ఒకరి చేతుల్లో నుంచి మరొకరి చేతుల్లోకి వెళుతూ దాని వెలుగులు ప్రపంచమంతటా తీసుకెళుతుందో అలాంటి తరహాలో ఆమె ఉద్యమాన్ని చేతులు మారుస్తోంది. కేవలం 12 ఏళ్ల వయస్సు నాటికే 'బార్న్ టు ఫ్లై'లో చేరిన మరియా ఫెర్నాండా అటువైపుగా కదలడానికి తన కళ్లెదుటే కదులుతోన్న పరిస్థితులే కారణం. లాటిన్‌లు ప్రాణం పెట్టే సాకర్ ఆడపిల్ల ఆడకూడదని సవతి తండ్రి ఆంక్షలు... పాఠశాల నుంచి ఇంట్లో వాతావరణం వరకు ప్రతిదీ కూడా ఆడపిల్ల ఎలా అణగిమణగి ఉండాలి... అని చెప్పడానికే అన్న విషయం చిన్ననాటికే అర్థమైంది. రేప్‌కు గురైనా కూడా వయస్సు చిన్నదైనా... గర్భం ప్రాణం మీదకు తెచ్చినా అబార్షన్ చేయించుకోకూడదనే చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమం నడుస్తోందక్కడ. టీనేజీ యువతులపై గృహ హింస, లైంగిక దాడులు తీవ్రస్థాయిలో ఉంటాయి. ఈ మధ్యే మహిళల రక్షణకు ఓ చట్టం వచ్చినా ఆ కేసుల చర్చ నడవకముందే హత్యలకు గురవుతోన్న వారి సంఖ్య పెరుగుతోంది. ఇలా చట్టం చట్టుబండలవుతోంది. అమ్మాయి అంటే కేవలం పిల్లల్ని కనిచ్చే యంత్రమని, లొంగి ఉండే బానిసని, సేవలు అందించే సాధనమని మాత్రమే అక్కడి మచిస్మో సంస్కృతిలో బలపడిపోయి ఉంది.

దీన్నే మార్చే ప్రయత్నం చేస్తోంది ఈ పుడమి దీపం.

ఆఫ్రికా తేజస్సు

"నా పురిటి గడ్డ అంటే పేదరికం, రోగాలు, వెనుకుబాటుతనం, కరువు కాదు.. నా నేల తల్లి చీకటి ఖండం కాదు.. ప్రపంచానికి మాతృ గర్భం" అని ఆఫ్రికా గురించి గొప్పగా చెప్పుకున్నది నల్ల జాతి వజ్రం నెల్సన్ మండేలా అని అనుకుంటున్నారా. ఈ మాటలు ఓ ఆడపిల్ల నోటి వెంట వస్తే..! ఆ చైతన్యం పేరే జురీల్ ఒడువొలె. 12 ఏళ్లకే తమ సంస్కృతిపై నాలుగు డాక్యుమెంటరీలు తీసింది. 14 మంది ఆఫ్రికా దేశాధ్యక్షుల ఇంటర్వ్యూలు తీసుకుంది. అతి పిన్న ఫిల్మ్‌మేకర్‌గా గుర్తింపు పొందింది. ఈ యువ సంచలనం ఆఫ్రికా యువతికి ఓ ప్రామిస్ చేస్తోంది... తాము ఏదైనా చేయగలమని. ఇలాంటి ఓ ప్రామిసే ఆఫ్రికా... ప్రపంచానికి చేస్తోందని ఆమె తీసిన 'ప్రామిసింగ్ ఆఫ్రికా' అనే ఫిల్మ్ సిరీస్‌తో సరికొత్త ఆఫ్రికాను ప్రపంచానికి పరిచయం చేసే పనిపెట్టుకుంది. నల్లజాతివాళ్లు తక్కువ కాదనే సందేశం ఆమె మాటల్లో ముఖ్యంగా కళ్ల వెలుగుల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఇదే ప్రపంచవ్యాప్తంగా ఉన్న నల్లజాతివారికి జురీల్‌ను ఓ ఐకాన్ చేసేసింది. టాంజానియా, లైబీరియా, కెన్యా, దక్షిణ సూడాన్, నైజీరియా, కేప్ వెర్దెలాంటి దేశాల అధినేతలు ఆమెతో మాట్లాడేందుకు ఇంటర్వ్యూలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఓ ప్రఖ్యాత పత్రిక 100 మంది అత్యంత శక్తివంతమైన వ్యక్తుల జాబితాలో ఈమె పేరునూ రాసేసింది. లాగోస్ రెడ్ కార్పెట్ పరిచింది. 'డ్రీమ్ అప్, స్పీక్ అప్, స్టాండ్ అప్' అనే ప్రాజెక్ట్ ద్వారా 9 దేశాల్లోని 21 వేల మంది ఆఫ్రికా బాలల్ని కలిసి చైతన్యం తెచ్చే ప్రయత్నం చేసింది. అబ్బాయిలు మాత్రమే బడికి వెళ్లాలి.. అమ్మాయిలు ఇంట్లో ఉండి పనిచేసుకోవాలనే ఆఫ్రికా సమాజ తీరును మార్చేస్తోందీ పుడమి దీపం.



అమ్మేద్దామనుకుంది కానీ అప్పటికే సొనితాకు తన నేస్తాల వేదన అర్థమైపోయింది. ఆడపిల్ల అంటే ఏం మాట్లాడకూడని ఏం చెబితే అది చేయాల్సిన జంతువు లాంటిదని జీర్ణించుకుపోయిన సమాజంలో పెరిగిన అమ్మకు ఏం తెలుసు తాను మనిషేనని... స్వేచ్ఛగా బతికే అవకాశముంటుందని... అందుకే సరిగ్గా ఇవే పదాలతో 'బ్రైడ్స్ ఫర్ సేల్' అనే ఓ వీడియోను మొబైల్ ఫోన్‌లో తీసి యూట్యూబ్‌లో పెట్టింది సొనితా. ఆ వీడియోను అమ్మ కూడా చూసింది. తొలుత అమ్మకు అదో పీడ కల ఆ తర్వాత సగటు ఆడపిల్ల కనే కలలకు ఓ అర్థం కాని ర్యాప్ భాష. సరే ఇప్పుడే పెళ్లి వద్దులే అని అమ్మ అనడమే కాదు నాన్న కూడా సమాజం నుంచి రక్షణగా నిలిచాడు. ఇప్పుడు ఆడ పిల్ల కలల్ని తన ర్యాప్ సంగీతం ద్వారా ప్రపంచానికి వినిపిస్తోన్న సొనితా ఉటాహ్ లోని సంగీత కళాశాల విద్యార్థిని అయ్యింది. ఆఫ్ఘన్ అమ్మాయిలకు ఓ లెజెండ్ అయిపోయిందీ పుడమి దీపం. ఇప్పుడు లక్షలాది మంది యువతులే కాదు అమ్మానాన్నలు కూడా ఆమె ర్యాప్ గీతాలకు ఫ్యాన్స్.

వేనవేల కాంతులు

సామాజిక మాధ్యమాల్లో టీనేజర్లు ఆలోచించకుండా చేసే పోస్టులకు చాలా నష్టపోతున్నారు. ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు కూడా వార్తల్లో చూస్తున్నాం. అదే ఏదైనా ఆలోచించి పోస్ట్ చేస్తే చాలా సమస్యలకు దూరంగా ఉండొచ్చనే ఆలోచన చేసిందీ ఓ టీనేజరే. త్రిషా ప్రభు అనే ఈ అమ్మాయి ఈ సమస్యకు పరిష్కారంగా 'రీ థింక్' అనే యాప్‌ను అభివృద్ధి చేసింది. ఇది ఫోన్‌లో ఉంటే ఏ సామాజిక మాధ్యమంలోనైనా పోస్ట్ చేస్తుంటే దానిని స్క్రుటినీ చేసి ఓసారి ఆలోచించుకోమని ఈ సమస్య రావొచ్చనే హెచ్చరిక చేస్తుంది. ఇలా 94 శాతం వరకు ఇబ్బందికర పోస్టులు చేయకుండా టీనేజర్లు నియంత్రణలోకి వస్తున్నారని ఓ సర్వే కూడా చేసి ఫలితాల్ని వెల్లడించింది. ఇప్పుడు ఇదో అద్భుతమైన యాప్‌గా పేరు సంపాదించింది. టీనేజర్లకే కాదు వారి తల్లిదండ్రులకు కూడా పెద్ద తలనొప్పిని తగ్గించింది. ఇలాగే ఇంటర్నెట్ ద్వారా యువతుల్లో చేతన తెచ్చేందుకు త్రిష శెట్టి, సెజల్ హతీ, రోషియో వోర్టెగా ప్రయత్నిస్తున్నారు. 'షీ సేస్', 'గర్ల్స్ హెల్పింగ్ గర్ల్స్', 'గర్ల్ అప్' అనే ఇంటర్నెట్ సామాజిక మాధ్యమాల ద్వారా వారు ఆడపిల్లల లోకంలో వెలుగులు పంచుతున్నారు. ఎందరో పుడమి దీపాల్ని వెలిగిస్తున్నారు.



ఊర్మిళ

బాల్య వివాహం వద్దన్న 13 ఏళ్ల బెంగాలీ బాలిక రేఖా కాళింది, అమెరికాలోని ఫ్లింట్ ప్రాంతంలో స్వచ్ఛమైన తాగునీటి కోసం పోరాడుతున్న లిటిల్ మిస్ ఫ్లింట్, షాంఘై కఠిన వలస చట్టాలపై పోరు సలుపుతోన్న 15 ఏళ్ల ఝూన్ హైతే, యూకే ఇమ్మిగ్రేషన్ అధికారుల తీరుపై ఆగ్రహంతో ఉద్యమం ప్రారంభించిన టర్కీకి చెందిన కుర్దు యువతి మెల్టెమ్ అవ్సిల్, జెనిటల్ మ్యుటిలేషన్ (స్త్రీ మర్మావయవాల కోతల)పై తిరగబడి.. ఐరాస అధ్యక్షుడిగా ఉన్న బాన్‌కీ మూన్‌నే నిలదీసిన 17 ఏళ్ల ఫాహ్మ మొహమ్మద్, బాలికా విద్యపై ఇథియోపియాలో పోరాడుతున్న 15 ఏళ్ల హన్నా గొదెఫా, గృహ హింస, లైంగిక దాడులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తోన్న 17 ఏళ్ల షాలు శ్రీవాత్సవ, ఉత్తర కొరియా శరణార్థుల సమస్యల్ని వెలుగులోకి తెచ్చిన యియోన్మి పార్క్, అమ్మాయిలు కూడా ఉద్యోగాలు చేయగలరని ఫిలిప్పీన్స్‌లో గొంతెత్తిన నెఫీజా మొహమ్మద్, బాల్యవివాహాలు, అత్యాచారాల కారణంగా తల్లులైన టీనేజీ అమ్మాయిల సంరక్షణ కోసం కృషి చేస్తున్న సియెర్రా లియోన్ యువతి ఫాతిమాతా, గ్రామ సభల్లో అమ్మాయి కూడా మాట్లాడొచ్చనే హక్కు కోసం ఆరాటపడతున్న ఫిజీ టీనేజర్ అనా వక్తాబు, పాఠశాలల్లో ఆడపిల్లలకు వాష్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని కనీస హక్కుల గురించి చర్చ లేవదీసిన మాలవి బాలిక యవేతా, యువతుల హక్కులపై 40 వేల మందితో ఇసుక తుఫానులాంటి ఉద్యమానికి కారణమైన ఈజిప్ట్ అమ్మాయి యారా హేర్డీ, నేపాల్ బానిస వ్యవస్థలో ఒకటైన 'కమలారి' బాల సేవకుల సమస్యపై గళం విప్పిన యువతి ఊర్మిళ చౌదరి, 'హూలిగన్ స్పారో' డాక్యుమెంటరీతో లైంగిక హింసను కళ్లకు కట్టిన చైనా అమ్మాయి నన్ను వాంగ్ వంటి సగటు ఆడపిల్లలెందరో ప్రపంచ గతిని మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ పుడమి దీపాల వెలుగుల్లో ఓ ఇల్లే కాదు ఓ సమాజమే కాదు యావత్ ప్రపంచం మొద్దు నిద్ర నుంచి మేల్కొంటోంది. ఆడపిల్లంటే సాటి మనిషనే విజ్ఞానవంతమవుతోంది. ఇక్కడ వివక్ష అంతమవుతోంది. ఇంటికి దీపం ఇల్లాలు.. మరి పుడమికి దీపం.... ఆడ పిల్లే. కావాలంటే... గద్దించకుండా, తక్కువగా చూడకుండా, తీసిపారేయకుండా ఓ సారి మీ ఇంటి ఆడపిల్లకు స్వేచ్ఛగా మాట్లాడే అవకాశమివ్వండి. తన ఆశల్ని ఆకాంక్షల్ని లక్ష్యాల్ని వినిపించుకోండి. ఆమె జ్ఞానాన్ని, శక్తిని, సామర్థ్యాన్ని బయటకు తెచ్చే వీలు కల్పించండి. ఓ చైతన్యపు భాష మీరు నేర్చుకుంటారు. వివక్షకు తావు తెలుసుకుంటారు. సమానత్వమనే మాటకు అర్థం నేర్చుకుంటారు. అన్నింటి కంటే ఆడపిల్ల వెలుగుల విలువ తెలుసుకుంటారు. పుడమి దీపాన్ని మీ ఇంట కూడా ముట్టించుకుంటారు. మీ హృదయపు తులసి కోటలో భద్రంగా కాచుకుంటారు. వెలుగు కావాలిగా మరి. ★

ఓరీ..! వీరాభిమానీ...!

ఫుట్‌బాల్ పిచ్చి వీరాభిమానులకు ఎంత తీవ్రంగా ఉంటుందో ఈ మెక్సికో కుటుంబరావును చూస్తే అర్థమవుతుంది. సిగరెట్‌కు వెళ్లొస్తానని భార్యకు చెప్పి ఏకంగా విదేశం చెక్కేసి ఫుట్‌బాల్ మ్యాచ్ చూసొచ్చాడు. పుయెబ్లా ప్రాంతానికి చెందిన ఆంటోనియో గార్సీకి ఫుట్‌బాల్ ఉంటే చాలు ఫుడ్ అక్కర్లేదు. తమ దేశపు జట్టు టీవీలో కనిపిస్తే చాలు కట్టుబడిపోతాడు. సొంత దేశంలో మ్యాచ్‌లుంటే కచ్చితంగా స్టేడియంకు వెళ్లి చూడాల్సిందే. కానీ విదేశాల్లో మ్యాచ్‌లంటేనే కాస్త ఆలోచిస్తారు ఎంత పిచ్చి అభిమానైనా. కానీ ఈ విషయంలో వెనక్కు తగ్గేది లేదని ఆంటోనియోని చూస్తే అర్థమవుతుంది. సాటి అభిమానులకు ఈ విషయంలో గొప్ప పనే కావొచ్చు కానీ ఓ విషయంలో మాత్రం అందరూ ఆలోచించాల్సిందే. వెంటనే ఫ్లైట్ టికెట్‌కు డబ్బు మనోడు సర్దుకుంది భార్య ఎప్పటి నుంచో దాచుకున్న పొదుపు నుంచి. ఆమెకు తెలీకుండా విదేశం వెళ్లడమే కాదు సొమ్ము ఓ రకంగా దొంగిలించాడు. తన ఊరి నుంచి మోంటెరెరీ చేరకుని అక్కడ ఫ్లైట్ ఎక్కి జర్మనీలోని వోల్ఫ్స్‌బర్గ్‌కు చేరుకున్నాడు. అక్కడ మనోడి చుట్టాలున్నారులెండి. వారి సాయంతో ఓ కారులో రష్యాలోని కజన్ స్టేడియానికి వెళ్లాడు. బంధువుల ఇంటి దగ్గర సరదాగా ఫుట్‌బాల్ కూడా ఆడి కాలి మడిమకు గాయం కూడా చేసుకున్నాడు. అందుకే కారులో వెళ్లాల్సి వచ్చింది. బెడ్ రెస్ట్ తీసుకోమని వైద్యులు చెప్పినా వినకుండా క్రచెస్ మీదే స్టేడియంలో కాలు మోపాడు. ఇంత కథ నడిచాక భార్య ఏమనకుండా వుంటుందా... అస్సలు ఇంట్లోకి రానిస్తుందా...? అని పక్కనోళ్లకు కంగారు పడుతుంటే ఎయిర్‌పోర్టులో ఏదో ఒక డ్యూటీ ఫ్రీ గిఫ్ట్ కొనుక్కెళ్లి ఊరడిస్తాలే ముందు మ్యాచ్‌ను ఎంజాయ్ చేయండని క్రచెస్ చరిచాడట. ఓరి వీడి వెర్రి అభిమానమో...!



ఇంటి మీద రోడ్డు

చైనాలోని చాంగ్‌క్వింగ్ నగరానికి ఓ ప్రత్యేకత ఉంది. ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్ విచిత్రంగా దాన్ని పిలుస్తుంటారు. ఎందుకంటే అక్కడి రైలు మార్గం ఆకాశహర్మ్యాల మధ్య అంతస్తుల గుండా పోతుంది. రెండు వరసల రోడ్డు మధ్యలో డివైడర్ వాటిల్లో మొక్కలు ఇవన్నీ కూడా భవంతుల మీదే. 13 అంతస్తుల ఎత్తుండే పాదచారుల వంతెనలు కూడా అక్కడ చూడొచ్చు. అలాగే వేర్వేరు దిక్కులకు చేర్చే 15 రోడ్డు ర్యాంపులు మరీ ఆశ్చర్యం కలిగిస్తాయి. ఇన్ని విన్యాసాలు చేసి ఇళ్లు కట్టడానికి కారణం అక్కడి నైసర్గిక స్వరూపమే. విపరీతమైన ఎత్తు పల్లాలతో ఉండే ఆ ప్రాంతంలో కొత్తగా ఓ నిర్మాణం చేయాలంటే అసాధారణ రీతిలోనే ఆలోచించాలి. అవసరమైతే ఊహల బేహారులకు పని అప్పజెప్పాల్సిందే. కలల్లో మనకు వింత విచిత్రాల ఇల్లు కనిపిస్తాయి. ఆకాశానికి మెట్లు కనిపిస్తాయి. అలా ఆలోచించగలిగితే ఇక్కడ మంచి అర్బన్ ప్లానర్ అయిపోవచ్చు. ఇలా ఈ మధ్యే మరో విచిత్రం లిస్ట్‌లో చేరింది. కొండ పక్కగా కట్టిన ఐదు అంతస్తుల భవంతిని పూర్తిగా ఇండోర్ పార్కింగ్‌కు వాడుతున్నారు. ఈ భవంతి దాని పక్కనే ఉండే ఆకాశహర్మ్యానికి పార్కింగ్ ప్లేస్ అన్నమాట. మరి పార్క్ చేసిన కార్లు కింది అంతస్తుకు వచ్చి రోడ్డెక్కవు. అవి రూఫ్‌టాప్ మీదకు చేరుకుని అక్కడ వేసిన రెండు వరసల రోడ్డుపై వెళ్లి ప్రధాన రోడ్డుకు కలుస్తాయి. ఐదు అంతస్తుల భవంతికి మామూలు అపార్ట్‌మెంట్‌ల్లానే కిటికీలు, డోర్లు కనిపిస్తాయి కానీ లోపలంతా పార్కింగ్ ఏర్పాట్లే ఉంటాయి. ఎప్పుడైనా ఈ ఊరు వెళితే ఓ కలలో ప్రయాణం చేసినట్టు ఉంటుందేమో.



వింత లోకం

కాకులు చదువుతాయా..!

జపాన్‌లో కాకులది మామూలు గోల కాదు. ముఖ్యంగా ఒట్సుచీ ప్రాంతంలో. అక్కడి విశ్వవిద్యాలయంలో కొన్ని చోట్ల 'ఇక్కడ కాకులకు ప్రవేశం లేదు' అనే సైన్‌బోర్డులు కనిపిస్తుంటాయి. అదేంటి కాకులు చదివి అర్థం చేసుకుని రాకుండా ఉంటాయా? అని తల గోక్కుంటే టపీల్మని కట్సుపుమీ సాటో అనే ప్రొఫెసర్ గారు అయోమయంలోకి ఎంటర్ అవుతాడు. జంతువుల ప్రవర్తనపై అధ్యయనం చేసే శాస్త్రం యూథాలజీని ఆయన బోధిస్తాడు. ఓ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అయిన సాటోకే కాకుల ప్రవర్తన గురించి ఓ మిత్రుడు బోధించాడట. అదేమంటే... ప్రవేశం నిషిద్ధమనే సైన్‌బోర్డులు చూస్తే కాకులు రాకుండా ఉంటాయట. అందుకే విశ్వవిద్యాలయంలో కాకుల గోల ఎక్కువుండే ప్రాంతాల్లో అలాంటి బోర్డులు ఏర్పాటుచేశామని సాటో గారు సెలవిస్తారు. అన్ని ప్రయత్నాలు చేశాం కదా చివరిగా ఈ ప్రయత్నం కూడా చేద్దామని 2015లో ఏదో

గుడ్డిగా బోర్డు తగిలించేసిన సాటోకి కూడా ఆ బోర్డులు తగిలించాక కాకులు ఎందుకు అక్కడ పచార్లు చేయడం లేదో అంతుబట్టలేదు. ఈ మధ్యే మనోడికి బల్బ్ ఎలిగింది. కాకులు బోర్డుల్లోని జపనీస్ భాషలో రాసిన సందేశం చదివి వెనక్కు తగ్గడం లేదూ... ఆ బోర్డుల్ని చూసిన మనుషులు ఆశ్చర్యంతో ఆకాశానికేసి చూసి పదేపదే కాకులు అక్కడున్నాయి... ఇక్కడున్నాయని వేళ్లతో పొడుస్తుండటం.. చెదరగొడుతుండటం... దాన్ని చూసిన కాకులు మనుషులేదో చేయబోతున్నారని భయపడి అటుగా రావడం లేదని తెలుసుకున్నాడు. అంతకు ముందు ఎన్ని కాకులు నెత్తి మీద తిరుగుతున్నా... దండులా కిటికీ అద్దాలపై దాడి చేసి భవంతిలోకి చొరబడేందుకు ప్రయత్నించినా ఎవరూ పట్టించుకునేవాళ్లు కాదు. ఇలా గానీ మన దేశంలో జరిగిందంటే మనం సరదాగా మాట్లాడుకునే కాకి భాష బదులు అన్ని భాషలూ కాకులకు తెలుసట అని పెద్ద ప్రచారమే చేసి ఓ స్కూలే తెరిపించుదురు. జరిగేది ఒక్కటి అర్థం చేయించేది మరొకటి గురువా..!

తెలుసా

జన ఘనం



- 'వరల్డ్ ఒ మీటర్స్' అధ్యయనం ప్రకారం ప్రస్తుత ప్రపంచ జనాభా 7.5 బిలియన్లు.
- ప్రపంచ జనాభా సమస్యపై అవగాహన పరిచేందుకు ప్రతి ఏటా జులై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.
- ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం మన దేశంలో తీవ్ర దారిద్ర్యాన్ని కలిగున్న వారి సంఖ్య 40 కోట్లు. ప్రపంచ జనాభా సంపాదనతో పోలిస్తే వీరిది 72.5 రూపాయల కంటే తక్కువే.

- ఐక్యరాజ్య సమితి తాజా గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 6 కోట్లు మంది ప్రజలు తీవ్ర సంక్షోభ పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు.
- క్రీ.శ. 1000 నాటికి ప్రపంచ జనాభా కేవలం 40 కోట్లు. క్రీ.శ. 1750 నాటికి వంద కోట్లకి చేరుకున్న ఈ జనాభా లెక్కలు 600 కోట్లకి చేరడానికి ఎక్కువ సమయం పట్టలేదు.
- ప్రపంచవ్యాప్తంగా 2 కోట్లుగా వున్న శరణార్థుల్లో అత్యధికంగా ఉంది సిరియా దేశస్థులే.

- ప్రపంచ దేశాల్లో అత్యల్ప జీవిత కాల పరిమితి కలిగిన దేశాలు సబ్ సహారా, ఆఫ్రికా . ఈ దేశాల్లో మనిషి జీవిత కాలం 55.9 సంవత్సరాలు.
- అపరిశుభ్ర పారిశుధ్యం కారణంగా ప్రతి ఇరవై సెకన్లకో చిన్నారి ప్రాణాలు కోల్పోతోంది.
- అభివృద్ధి చెందిన దేశాలు, పేదదేశా మధ్య ప్రజల సగటు జీవన వ్యత్యాసం 20 సంవత్సరాలు.

- 52 శాతం ప్రపంచ జనాభాలో ఎక్కువ మంది ముప్పై ఏళ్ళలోపు వారే.
- ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా 15కోట్ల మంది మగపిల్లలు మహమ్మద్ పేరుని కలిగున్నారు.
- ఫేస్ బుక్‌ని ఒక దేశంగా అనుకుంటే ఇది ప్రపంచంలో మూడవ అత్యధిక జనాభా కలిగిన దేశంగా పరిగణించాల్సి వుంటుందనేది ఒక ఆసక్తికర విషయం.
- ప్రపంచ వ్యాప్తంగా గుర్తించబడిన 40 పేద దేశాల్లో 36 దేశాల నుండి ధనిక దేశాలకి ఆహారం ఎగుమతి చేయబడుతోందనేది ఒక నివేదిక.



- కుటుంబ నియంత్రణ, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజా సాధికారత నేపథ్యంతో 2017 ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు.
- చైనా(1,382,512,535), భారత్, అమెరికా, ఇండోనేషియా, బ్రెజిల్, పాకిస్థాన్, నైజీరియా అత్యధిక జనాభా కలిగిన దేశాల జాబితాలో మొదటి ఏడు స్థానాల్లో నిలిస్తే...వాటికన్ సిటీ(801), టొకెలావ్, నియి, శాన్ ఫాల్క్‌ల్యాండ్ ఐల్యాండ్స్, సెయింట్ హెలీనా, లీచెస్టెయిన్, మొనాకొ, మార్షల్ ఐల్యాండ్స్ అత్యల్ప జనాభా కలిగిన దేశాలుగా నమోదయ్యాయి.



విఠలాచార్య గారు మంచి చదువరి. కన్నడ రచయిత కరంత్ గారంటే అభిమానం..ఆచార్య గారింట్లో ప్రముఖ కన్నడ రచయితల దర్బారు జరుగుతుండేది. అందులో ఒకలైను తీసుకొని తను డెవలప్ చేసి 'మనె తుంచెదహెణ్ను' అనే కుటుంబ కథని తెరకెక్కించారు. అది కన్నడంలో విజయవంతమయ్యింది. నాగిరెడ్డిగారు కథల గురించి అన్వేషణలో వున్నారని తెలిసి 'ఈ కథ మీకు ఉపయోగపడుతుందేమో చూడండి! దీని రీమేక్ రైట్స్ మీకే ఇస్తున్నాను' అన్నారు. అయితే డబ్బు మాత్రం తీసుకోలేదు. ఎందుకంటే నాగిరెడ్డి గారి ద్వారా ఎంతో సహాయం పొందిన వ్యక్తి విఠలాచార్య ఈ రోజుల్లో మనుషుల్లో కృతజ్ఞతా భావం అలా వుండేది. చక్రపాణి గారు నరసరాజు గారు కథ మీద కూర్చున్నారు. వారు మూలకథలోంచి ఓ లైను మాత్రం తీసుకున్నారు. ఓ సవతి కూతురు మరో ముద్దుల కూతురూ వున్న కుటుంబం. తండ్రి అసమర్థుడు, తల్లి గయ్యాళి. ఆ కుటుంబాన్ని అంటిపెట్టుకొని గుంటకాడ నక్కలా కాచుక్కూర్చున్న వ్యక్తి..ఆయనకో రౌడీ కొడుకు.. ఆ కొడుకుని.. వారి ముద్దుల కూతురుకిచ్చి కట్టబెడితే ఆస్తి తన కొడుక్కే దక్కుతుందన్న దురాశ.. వీరి మధ్య కొన్ని ఆసక్తికరమైన సన్నివేశాలు.

స్థాయికి తగ్గట్లు

చక్రపాణి గారు నిర్దాక్షిణ్ణంగా కథను మార్చేశారు. అదీ నరసరాజు గారి సహాయంతో గుండమ్మ అనేది కన్నడ పేరు. పేరు బావుంది..కొత్తగా వుందని అలాగే వుంచేశారు. ఆమెను గయ్యాలిగానూ అమాయకురాలిగానూ మార్చారు. కథను మార్చినప్పుడే ఈ పాత్రకి గుండమ్మ అన్నీ ఫిక్స్ అయిపోయారు. సవితి కూతురు సావిత్రి పేరు లక్ష్మి..ముద్దుల కూతురు జమున..ఓ కొడుకు హరనాథ్ ఆయన ప్రేమికురాలిగా యల్.విజయలక్ష్మి, ఒక సంపన్న కుటుంబీకుడు యస్వీ రంగారావు ఆయన పెద్దకొడుకు అంజిగా ఎన్టీఆర్, రెండోకొడుకుగా రాజ్‌గా నాగేశ్వరరావు, గుంటనక్క పాత్రలో రమణారెడ్డి, ఆయన కొడుకు రౌడీ పాత్రలో రాజనాల. ఇదీ సినిమా కథ. వీరి మధ్య జరిగిన ఆసక్తికరమైన సన్నివేశాల కదంబమే గుండమ్మకథ!

ఎంతమంది డైరెక్టర్లు ?

తొలుత గుండమ్మకథని బి.యన్.రెడ్డిగారి చేతనే చేయించాలనుకున్నారు. ఆయన విని కథంతా గందరగోళంగా వుంది. నేను హ్యాండిల్ చేయలేను అంటూ తప్పుకున్నారు. కె.వి.రెడ్డిగారికి చక్రపాణి గారికీ మొదట్నించీ కథ విషయంలో చక్రపాణిగారు జోక్యం చేసుకోవడం వలన, అభిప్రాయ భేదాలున్నాయి. అందుకోసం ఆయనా సుముఖంగా లేరు. ఇలాంటి కథల్ని పి.పుల్లయ్యగారు బాగా డీల్ చేస్తారన్న నమ్మకంతో స్క్రిప్టు వారికి పంపించారు. వారంరోజుల పాటు కథ చదివి నాకేదో కన్‌ఫ్యూజన్‌గా వుంది. నేను చెయ్యలేను అంటూ సున్నితంగా తిరస్కరించారు. ఒకానొక సమయంలో ఈ కథను డ్రాప్ చేసుకుందామనుకున్నారు. చక్రపాణి గారికి మనస్కరించలేదు.

ఆపాత చిత్రం



తెలుగు సినిమా చరిత్రలో ఎప్పటికీ గుర్తిండిపోయే కుటుంబ కథా చిత్రం 'గుండమ్మ కథ'. విజయాసంస్థ అధినేతలు నాగిరెడ్డి చక్రపాణి మంచి కథ అన్వేషణలో వున్నారు. నిజానికి కథల కాణాచి చక్రపాణి గారే.. ఎందుకోతను చదివిన బెంగాలీ కథలు మనసుకి పట్టడంలేదు. అలాగని తమ సిబ్బందిని ఖాళీగా వుంచలేరు. ఒకరోజు నాగిరెడ్డి గారికి ఓ వైనం వినిపించారు. చక్రపాణిలో మంచి విజన్ వుంది. అది వినగానే బావుంది. దీని మీద కూర్చుంటే మంచి కథ అయ్యే అవకాశాలున్నాయి. దీన్ని హాస్య భరిత కుటుంబ కథా చిత్రంగా మార్చేద్దాం.. డి.వి. నరసరాజు గార్ని పిలిపించండి అన్నారు.

గ

ఆయన దృష్టిలో కమలాకర కామేశ్వరరావు పడ్డాడు. ఆయన వినయశీలి మంచి జర్నలిస్టు. కథకుడు.. సినిమా పరిశ్రమలోకి రాకముందు కృష్ణాపత్రికలో సినీ విమర్శలు రాస్తుండేవాడు. మంచి చదువరి ఆయనకు స్క్రిప్ట్ ఇచ్చారు. ఆయన చదివి ఇందులో గుండమ్మ భర్త వుంటే బావుంటుంది. సూర్యకాంతాన్ని సుమంగళిగా బొట్టూ, పూలతో చూపిస్తే బావుంటుంది అన్నాడు. "సర్లేవయ్యా అంత గయ్యాళిలికి పెళాం మాటకి ఎదురు చెప్పలేనివాడు వున్నా ఒకటే, వూడినా ఒకటే! స్క్రిప్ట్ ఇది! దీనికి న్యాయం చెయ్యి! అంటూ కరాఖండీగా చెప్పేశాడు. కమలాకర తెలివిగా సావిత్రి, యన్.టి.ఆర్ పాత్రల్ని మలచుకున్నాడు అలా కమలాకర కామేశ్వరరావు కనఫర్మ్ అయ్యాడు.

పాటల పూదోట

కథ అరకొరగా వుంది కాబట్టి ఈ సినిమాకి సంగీతం ప్రాణం పొయ్యాలి. పాటలన్నీ జనం నాల్కలమీద నానాలి. ఈ సినిమాలో పాటలు హిట్ అయితే సగం సినిమా హిట్ అయినట్లే అనుకున్నారు నాగిరెడ్డి-చక్రపాణి గార్లు. ఆస్థానకవి పింగళి నాగేంద్రరావుని పిలిపించారు. కమలాకర కామేశ్వరరావు సిట్యుయేషన్స్ చెప్పారు. ఇందులో ప్రతిపాటా సందర్భంలోంచి

పుట్టుకొచ్చి, పాత్రలు పాడుకున్నవే.. సరళభాష. ఇందులో ప్రధానంగా చోటు చేసుకుంది. "స మూసినా నీవాయే.... తెల్లని వెన్నె మూసినా నీవాయే..." జమున పా మధురమైన పాట. చాలా బాగా ప ఈ రేయి.. ఎంత మధురమీ హాయ పాడినపాట, మూడవది "లేచింది

ఘంటసాల పాడిన పాట, య పాట. నాల్గవది "కోలుకోలుమన్న క మాంచి జోడు..." ఈ పాటని కూ యన్‌టిఆర్ మీద చిత్రీకరించారు. నాగేశ్వరావు, జమునల మీద చిత్రీక "ప్రేమయాత్రలకు బృందవనమూ పాట కూడా అక్కినేని సావిత్రల మీ మార్చెను, భాషను మార్చెను. మో మారెను. అయినా మనిషి మారలే

...ండమ్మ కథ

...ర్నగ వీచే చల్లగాలికి... కనులు
...పానుపుపై నా కనులు
...న పాట.. సుశీల ఆల్బమ్‌లో ఓ
...డింది. రెండవది "ఎంత హాయి
..." ఘంటసాల సుశీల
...ద్రలేచింది మహిళాలోకం..."
...న్‌టిఆర్ మీద చిత్రీకరించిన
...లో నా సామి కొమ్మలిద్దరు
... ఘంటసాల పాడారు.
...వేణుగానమును వింటితే ఇది
...రించిన పాట. అలాగే
...ందనవనమూ ఏలనో..." ఈ
...ద చిత్రీకరించిన పాట. "వేషము
...ము నేర్చెను. అసలు తానే
...ు...." సుశీల ఘంటసాల

పాడిన పాట.. చివర్లో "అలిగిన వేళనే చూడాలి... గోకుల కృష్ణుని అందాలూ..." సుశీల పాడిన పాట. యన్‌టిఆర్‌పై చిత్రీకరించిన పాట. ఇలా ప్రతిపాటా ఆణిముత్యం! పాటలన్నీటికీ గాయనీ గాయకులూ.. నటీనటులూ ప్రాణం పోశారు. అన్నీ జనరంజకమైన పాటలే! ప్రజలకు నచ్చిన పాటలు.. చిత్రకథకి ప్రాణం పోసిన పాటలు.. ఈ క్రెడిట్ మొత్తం సుస్వరాల ఘంటసాల గారికీ, సుశీలమ్మకీ పింగళిగారికే చెందుతాయి.

అగ్ర నటీనటుల అంకిత భావం

'గుండమ్మకథ' సినిమా చేసే నాటికే అక్కినేని, యన్‌టిఆర్ అగ్రనటులు. వారితో బాటు సావిత్రి, జమున, సూర్యాకాంతం, యల్ విజయలక్ష్మి, ఛాయాదేవి, విజయ స్టూడియోలోనే జరిగింది. ప్రేమయాత్రలకు బృందావనం నాగలితో దున్నుతూ అక్కినేని, జమునలు పాడుకొనే పాట దాకా అంతా స్టూడియోలోనే జరిగింది. ఇందులో నిర్మాతా దర్శకులు బయటకి చెప్పుకోలేని ఇబ్బందులు చాలా వచ్చాయి. మొదటిది ఈ కథ మీద ఎవరికీ నమ్మకం లేదు. రెండవది అక్కినేని, యస్వీఆర్ లాంటి అగ్రనటులు నటిస్తుండగా ఆ సినిమా టైటిలు. గుండమ్మ కథగా రావడం ఇబ్బందే.. అయినా ఇద్దరు అగ్రనటులు ఒక సంస్థని ప్రేమించారు. కథని .. ప్రేమించారు. వారివారి పాత్రలకు జీవం పోశారు. నిజానికి యస్వీరంగారావుది చిన్న పాత్ర అయినా పెద్ద మనసుతో చేశారు.

అలాగే రాజనాల బిజీస్టార్.. ఆ పాత్రకి నిర్మాతల అభ్యర్ధనని కాదనలేక పోయారు. గుండమ్మ కూతుళ్ళు సావిత్రి, జమునలు అయినప్పుడు కొడుకు, కోడలు ఎలావుంటారో ఆ స్థాయికి తగ్గకుండా హరనాథ్, యల్ విజయలక్ష్మిలను తీసుకున్నారు. నటీనటుల విషయంలో ఎక్కడా రాజీపడలేదు. కథలో పాత్రల స్వభావానికి అతికినట్టు సరిపోతారు. అందుకే గుండమ్మ కథ కథలా వుండదు. ఓ జీవితంలా ఉంటుంది. మనకు తెలిసిన ఒక కుటుంబ కథలా వుంటుంది. ఇంతమందితో షూటింగు చేయడమంటే మాటలా? ముందు కాంబినేషన్‌లో వచ్చేషాట్స్ తీసుకొని వాళ్ళ పొజిషన్లు మార్క్ చేసుకొని. ఎవరికి ఎప్పుడు అవకాశం వుంటే.. అప్పుడు క్లోజ్ షాట్స్ తీసుకొనే వారు.

డి.వి. నరసరాజు గారి సంభాషణ బాగా ఎంజాయ్ చేసేవారు నటీనటులు. షూటింగు మొత్తం నల్లేరుమీద నడకలా సాగిపోయింది. శరవేగంతో షూటింగు జరగడానికి ప్రధానమైన కారణం ఫోటోగ్రాఫర్ మార్కస్ బార్ట్లే చాలా జీనియస్. కమలాకరుడ్ని ఏమాత్రం కష్టపడనియ్యకుండా సహకరించారు.

సంక్షిప్తంగా

సూర్యకాంతం సంపన్నురాలు.. సవతి కూతురు సావిత్రి. ముద్దుల కూతురు జమున యస్వీ రంగారావు మరో సంపన్నుడు ఇద్దరు కొడుకులు ఎన్‌టిఆర్, అక్కినేని, యస్వీఆర్ గుండమ్మ కూతుళ్లనిచూడ్డానికి వచ్చి ఆమె గయ్యాళి తనానికి ఒక్క కూతురి గయ్యాళికి బుద్ధి చెప్పగలిగితే.... మంచికోడలు అవుతారని కొడుకుని పంపిస్తారు. ఎన్టీఆర్ పనివాడిలా సవతి కూతురు సావిత్రిని ఆకర్షిస్తాడు. రెండోకొడుకు ఎఎన్నార్ డాబూ దర్పం చూపించి జమునని వల్లో వేసుకుంటాడు. హరనాథ్ ఎల్.విజయలక్ష్మిని పెళ్ళిచేసుకుని ఆమె మేనత్త ఛాయాదేవిని ఇంటికి తీసుకువస్తాడు. మధ్యలో చిన్నకూతురితో తన కొడుకు పెళ్ళి జరిపించాలనే గంటయ్య పాత్రలో రమణారెడ్డి, అతని కొడుకు పాత్రలో రాజనాల ఇంతే కథ. వీరి మధ్య నాటకీయంగా సాగిన సన్నివేశాలు... ప్రతి సన్నివేశానికి కౌంటర్ సన్నివేశం రూపుకల్పన చేయడం ఉదాహరణకి సూర్యకాంతానికి ఛాయాదేవి బుద్ధిచెప్పితే... ఛాయాదేవికి బుద్ధి చెప్పటం రాజనాలకు ఎన్టీఆర్ దేహశుద్ధి చేయడం.. ఎన్టీఆర్‌ని పనివాడిగా, అమాయకుడిగా చూసిన సావిత్రికి ఓ ఎస్టేట్ యజమానిగా అనిపించడం భలే థ్రిల్‌గా ఉంటుంది. స్వతహాగా ఆశాపాత్రులైన గుండమ్మ సవతికూతురు లక్ష్మిసంపన్నరాలి కోడలని తెలిసి మురిసిపోవడం ఉదయం నిద్రలేవగానే అమ్మ కాఫీ అని అంటూ అరిచే జమున పొలంలో పనిచేసి... కూలీ డబ్బులు కోసం సొంత మామయ్య దగ్గరకు వెళ్ళడం ఇవన్నీ నాటకీయంగా ఉన్నా ప్రేక్షకుల్ని ఉర్రూతలుగించాయి. నటీనటులందరూ పాత్రలకు ప్రాణం పోశారు. అది ప్రేక్షకులకు నచ్చింది. జూన్ 7వ తేదీ 1962 సంవత్సరంలో విడుదలైన చిత్రం. ఇప్పటికీ నిత్యనూతనంగా వుంది. అందుకే విజయ సంస్థ ప్రతిష్మాత్మకమైన సంస్థగా నిలిచింది.

అఖండ విజయం

ఈ సినిమా ప్రివ్యూ వేశారు. ఎన్.టి.ఆర్. పప్పు రుబ్బుతున్న సన్నివేశం వచ్చినప్పుడు థియేటర్‌లో జనం ఘొల్లుమన్నారు. ఛాయాదేవి, సూర్యకాంతానికి బుద్ధి చెప్పుతున్నప్పుడు... ఛాయాదేవికి సావిత్రి బుద్ధిచెప్పుతున్నప్పుడు ఎన్‌టిఆర్ అలిగిన సన్నివేశంలోను ప్రేక్షకులు చాలా బాగా కనెక్ట్ అయ్యారు. సినిమా అయిపోయిందో తెలియదు... వెనువెంటనే మళ్ళీ ప్రివ్యూ వేయించారు. చక్రపాణిగారు ఆ ప్రివ్యూకి అంతకు మించిన స్పందన. అంతే! ఈ సినిమా సూపర్‌హిట్ అంటూ.. గట్టిగా కన్‌ఫర్మ్ చేశారు. చక్రపాణిగారు తన పంతం నెరవేరినందుకు ఆయన కూడా సంబర పడిపోయారు. సినిమా విడుదలైంది ఊహించని స్పందన.... శతదినోత్సవాలూ.. రజతోత్సవాలూ జరుపుకుంది. విజయ వారి సాంఘిక చిత్రాలలో మకుటాయమానంగా నిలిచిపోయింది.

ఇమంది రామారావు

9010133844

కవిత్వం

మా అమ్మ

ప్రతీ సాయంత్రం చిమ్నీ మసినంతా
తన అందమైన చేతులతో తుడిచేసి
ఇంట్లోనే ఒక చంద్రుడిని వెలిగించేది
మా అమ్మ
చీకటినినెమ్మదిగా వ్యాపిస్తుంటే
మేఘాల మెట్లెక్కి
గగరతలానికి చేరిన చంద్రుడు
క్రిందికి చూసి తెల్లబోయేవాడు
పొద్దున్నే నిదురలేచి
ముందు ముఖం కడుక్కుని
నుదుటిపై సూర్యుడిని
కుంకుమగా దిద్దుకునేది
మా అమ్మ
తూరుపు వాకిట్లో
ఉదయించే రవిబింబం
ఈ దృశ్యాన్ని చూసి
ఆసక్తిగా కళ్ళప్పగించేది
పొద్దుగూకాక
సెలవు తీసుకుంటున్న సూర్యుడు
పైకి ఎగబాకుతున్న చంద్రుడు
ఒక్క క్షణం ఈ విషయాన్ని చర్చించుకుని
తమ పనిలో నిమగ్న మయ్యేవారు
ఇవేవీ తెలియని
మా అమ్మ మాత్రం
వెన్నెలనంతా ముద్దు చేసి
నాకు ప్రేమగా గోరుముద్దలు తినిపించేది

- పద్మావతి రాంభక్త
9966307777

నీ చెంతకు మళ్లీ రానా

నిన్ను రోజూ చూస్తున్నా
తనివితీరని అనుభూతి
ఒకప్పుడు నేనొక్కడినే అనుకునేవాడ్ని
నువ్వు పరిచయమైనప్పట్నించీ
నువ్వే నాకు సర్వస్వం
నిన్ను తలచుకున్నప్పుడల్లా
హృదయాంతరాలు బరువెక్కి
మస్తిష్కం పులకరిస్తుంది
సాయంత్రమైతే చాలు
నీ చెంతకు చేరాలనిపిస్తుంది
నీదగ్గరకు ఒంటరిగానే వస్తాను
నిన్ను చూశాక ఎంత ఉప్పొంగిపోతానో
నీకన్నా మించిపోయి ఉబ్బితబ్బిబయిపోతాను
అసలు నిన్ను వదిలి రాలేనెందుకో
రాత్రంతా తేలిపోవాలనిపిస్తుంది
ఆవేదనలన్నీ నీలో కలిసిపోయి ఎటెళ్లిపోయాయో
నేనొక్కడినే మిగిలిపోయాను
నీలో కలిసిపోయాను
సాయం సంధ్య కరిగిపోతూ
చిమ్మచీకటిలా ఒరిగిపోతూ
నిశీధిలోకి జారుకున్నా
నాలో చలనమే లేదు
నీ విశాల నిరంతర ప్రశాంత ఘోషలో
నేనూ లీనమైపోయి
నీలో నిండిపోయి
నిలువెల్లా హత్తుకుపోయి
నీలానే ఉండిపోవాలనిపిస్తోంది
వెళ్లలేక వెళ్తున్నాను
ఓ సాగరమా
నీ చెంతకు మళ్లీ రానా
పున్నమి వరకూ వేచి వుండలేనేమో

-కె.వి.రమణమూర్తి
9966513257

కథ

అప్పుడే తెల్లారింది

- బెందాళం క్రిష్ణారావు
bendalamkrishnarao@gmail.com

రాత్రంతా కురిసిన వర్షానికి ఆ పూరింట్లో వాసాల మీద నుంచి ఒక్కటొక్కటే వాన చినుకులు జారి చిన్న మడుగుగా మారాయి. తుంగ చాప మీద పడుకుని అటు నుంచి ఇటు దొర్లిన రాధమ్మ కాలు ఆ నీటిని తాకి ఒక్కసారిగా చల్లనిదేదో అంటుకున్నట్లుగా అన్పించి ఉలిక్కిపడి లేచింది. అప్పటికే ఆ ఇంటి ముంజూరు పెణక కింద నుంచి సూర్యకిరణాలు లోపలకు రావడానికి దోబూచులాడుతున్నాయి.

"బాగా తెల్లారిపోయిందే" అనుకుంటూ నిద్ర లేచింది. పక్కకు చూసింది. ఆ గుడిసెలోనే మరో మూల రాధమ్మ కూతురు వసంత, అమె కొడుకు చిన్నోడు ఇంకా నిద్ర పోతూ కన్పించారు. ముక్కుపచ్చలు ఇంకా ఆరలేదు చిన్నోడికి. ఎందుకో రాత్రంతా ఒకటే ఏడుపుతో సతాయించాడు. ఎలాగోలా తల్లీకూతుల్లిద్దరూ వాడిని సముదాయించి నిద్రపుచ్చేసరికి అర్ధరాత్రి దాటింది.

వారుంటున్న పూరిల్లు ఆ ఊరికి ఎడంగా కొసలో ఉంది. దగ్గర్లోనే శ్మశానం. ఆ ఊళ్లోవాళ్ల పొలాలకు వెళ్లే దారి కూడా సమీపంలోనే ఉంది. ఆ ఊరు పేరు శ్రీహరిపురం, ఊరి పక్కనే కొండవాగు ప్రవహిస్తూ ఉంటుంది.

ooo

పుట్టుకతోనే తల్లిని చంపిందని నిందలు మోసి పెరిగిన రాధమ్మకు ఇరవై యేళ్లు వచ్చేసరికి అప్పటికే తాగుడుకు బానిసైన తండ్రి నీలయ్య శరీరం కూడా దాదాపు శిథిలమైంది. రాధమ్మకు ఏ అండ చూపకుండానే నీలయ్య చనిపోయాడు ఆమెను ఒంటరిని చేసేసి.

ఈ ప్రపంచంలో తనకంటూ ఉన్న ఒకే ఒక మనిషి తన తండ్రి చావు ఆమెను నిలువునా కుంగదీసింది. అప్పట్నుంచీ ఆమెకు కష్టాలు రెట్టింపయ్యాయి,

రోజులు గడిచే కొద్దీ తనకు తానే ధైర్యం చెప్పుకుని కూలీపనుల్లో మునిగిపోయేది.

అలా పొలం పనుల్లో ఉండగానే ఒక రోజు ఆ ఊరి మునసబు భుజంగరావు కళ్లు రాధమ్మ మీద పడ్డాయి. కూటికీ, కులానికీ గతి లేదు కాబట్టి ఎలాగోలా దారిలోకి తెచ్చుకోవాలని మనసులోనే అనుకున్నాడు. అయితే ఆ విషయాన్ని ఎక్కడా బయటపెట్టలేదు. అందుకూ కారణముంది.

ఆ ఊళ్లో ఎక్కువమంది జనం కూటికి లేకపోయినా బతకగలరు గానీ కులం కాని పని చేస్తే పరువు అంటూ పీకలు తెగ్గోసుకునే సంస్కృతికి అలవాటు పడిపోయారు.

అలాంటి సమయంలోనే ఆ ఊరి అమ్మోరి పూజారికి ఒకసారి పూనకం వచ్చేసింది. ఊరి బాగు గురించి పూజారే ఆమ్మోరై ఏం చేయాలో అన్నీ చేప్పేశాడు... "గ్రామదేవత అయిన తనకు శాంతి చేయాలని, అందుకోసం సంబరాలు జరపాలని, అందులో ఊరికి కొసలో ఒంటరిగా ఉండే ఒక కన్నె పిల్లని మాతంగిగా మార్చి తనకు సేవలు చేయించాలని ఇలా..." ఎన్నో చేప్పేశాడా పూజారి.

"అమ్మోరే పూజారి నోట పలికించింది కాబట్టి ఆమె చెప్పినట్టే జరగాలి. లేదంటే ఊరికి అరిష్టం చుట్టుకుని ఎవరి ప్రాణాలు పోతాయో? ఏ కుటుంబానికి ఏ కీడు జరుగుతుందో?" అని భుజంగరావుతోపాటు మరి కొంతమంది పెద్దలు తీర్మానించేశారు. ఊళ్లోని ఆడాళ్లు కూడా ఇది వెంటనే చేయాలంటూ మగాళ్లకి వంత పాడారు.

అమ్మోరుకి సంబరాలు జరిగాయి. తాగినోళ్లకి తాగినంత సారా, తిన్నోళ్లకి తిన్నంత మాంసాలు, కొందరు మొక్కుబడులు తీర్చుకోవడం... ఇలా సంబరాలు జరిపోయాయి. ఆ ఉత్సవాల్లోనే రాధమ్మని మాతంగిగా మార్చే ప్రక్రియ కూడా జరిగింది.

అసలే నిస్సహాయురాలై, అనాధగా బతుకుతున్న ఆమె తనను మాతంగిగా మార్చొద్దని ప్రాధేయపడినా ఆ దీనాలాపనని పట్టించుకునే స్థితిలో ఎవరూ లేరు. అలా కన్నీళ్ల మధ్యే రాధమ్మకు పసుపునీళ్లతో స్నానాలు చేసేసి, దేవుని భార్య అంటూ పూజారితో సహా, గ్రామపెద్దలూ ఆమెని మరికొన్ని కార్యక్రమాల తర్వాత మాతంగిగా ప్రకటించారు.

రెండు పదుల వయసులోనే జీవచ్ఛవమైపోయింది రాధమ్మ. తన మనసుని రాయి చేసుకుని శరీరాన్ని కూడా ఎవరు వాడుకుంటున్నా చలనం లేని బొమ్మగా మారిపోయేది.

ఆ క్రమంలోనే రాధమ్మకి కూతురు పుట్టింది. తన బతుక్కి మరో తోడు దొరికిందని మనసులో సంబరపడినా దీని బతుకు కూడా తనలాగే మారిపోతుందేమో అని భయపడేది.

ఆ పిల్లకు వసంత అని పేరు పెట్టింది. ఎలాగోలా వసంతని చదివించి, ఆమెకు నచ్చినోడితో పెళ్లి చేయిస్తే తన జీవితానికి ఆదే పరమార్ధమని భావించింది. కాలంతో పాటూ పరిస్థితుల్లో కూడా మార్పులు వస్తున్నాయి. కొత్త తరం కాస్త చదువుకుని విద్యావంతులౌతుండటంతో వారి ఆలోచనల్లో కూడా మార్పులు వస్తున్నాయి.

కానీ ఆ ఊళ్లో మాత్రం ఇంకా పాతకాలపు అలవాట్లు, కట్టుబాట్ల పేరుతో అంటరానితనం వంటి జాఢ్యాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

దగ్గర్లోనే ఉన్న ఒక మిషనరీ స్కూలులో వసంతని చదివించింది రాధమ్మ. అప్పుడప్పుడూ కూతుర్ని చూడడానికి తానే హాస్టల్ దగ్గరికి వెళ్లొచ్చేది రాధమ్మ. ఆలస్యంగా స్కూల్లో జాయిన్ చేయడంతో పదోతరగతి పూర్తయ్యేసరికి వసంతకు పద్దెనిమిదేళ్లు వచ్చేశాయి. ఇంటర్మీడియట్ చదవాలంటే ఆ ఊరికి మూడు కిలోమీటర్ల దూరంలోని జూనియర్ కాలేజీకి వెళ్లి చదువుకోవాలి.

వసంతని బాగా చదివించాలని పట్టుదలతో ఉన్న రాధమ్మ ఆమెను ఇంటర్లో చేర్పించింది. అక్కడే పరిచయమయ్యాడు వసంతకి రాకేష్. అతనిదీ వీళ్లూరే. అతడు ఆ ఊళ్లోని మోతుబరి భుజంగరావుకి తమ్ముడి కొడుకు. ఒకే కాలేజీలో చదువుతుండడం వల్ల వారిద్దరి పరిచయం స్నేహంగా, స్నేహం ప్రణయంగా మారింది.

ఇవేవీ రాధమ్మకు తెలియదు. అందరిలాగానే తన కూతురు కూడా కాలేజీకి చదువుకోవడానికి వెళ్తోందనే అనుకుంటోందామె.

రాకేష్ కూడా ఇంట్లో వాళ్లకు భయపడి తమ ప్రేమ విషయాన్ని ఎప్పుడూ చెప్పలేదు. వసంతతో కలిసి తిరగడం మానలేదు.

పెళ్లి చేసుకుంటానని ఆమెను నమ్మించి శారీరకంగా వశపర్చుకున్నాడు. అతను చెప్పిన మాటలన్నింటినీ ఆమె నమ్మింది. అంతలో ఇంటర్మీడియట్ పరీక్షలై పోయాయి.

వసంత తనలో వస్తున్న మార్పులను నాలుగు నెలల వరకూ తల్లికి తెలియనివ్వకుండా దాచి పెట్టింది. ఆ తర్వాత ఆమె వలన కాలేదు. అప్పటికే కూతురి ప్రవర్తనలో వస్తున్న మార్పులు గమనిస్తోంది.

ఏదో జరగరానిది జరిగిందని రాధమ్మకి అర్థమైంది. తన కూతురి బతుకూ తనలాగే మారిపోతుందేమోనన్న భయం కొన్ని రాత్రులు నిద్రపోనివ్వలేదు.

రాకేష్ ప్రేమ విషయం వాళ్లింట్లో తెలిసిపోయింది. "దానితో నీకు ప్రేమేమిట్రా... వాడుకుని వదిలేయాలి గాని" అంటూ చీవాట్లు పెట్టారు.

రాధమ్మని "కూతురుతో సహా ఈ ఊరు వదిలి వెంటనే ఎక్కడికైనా వెళ్లిపోవాలని" భుజంగరావుతోపాటు అతని అన్నదమ్ములు కూడా హెచ్చరించారు. కొంతమంది పెద్దలను పోగేసి పంచాయితీ కూడా పెట్టారు. అయితే పంచాయితీలో ఎక్కువ మంది విచిత్రంగా తీర్పుచెప్పారు.

అదేమిటంటే రాధమ్మ ఆ ఊరి మాతంగి కాబట్టి ఆ కుటుంబాన్ని అక్కడ నుంచి పంపేయడం మంచిది కాదని, అలా చేస్తే ఆమ్మోరుకి కోపం వస్తుందని, ఊరికి అరిష్టం చుట్టుకుంటుందని వారి తీర్మానం. మరేం చేయాలో కూడా వాళ్లే చెప్పేసారు.

రాకేష్ వల్లే వసంతకు కడుపు వచ్చింది కాబట్టి దానిని తీయించడానికి పరిహారంగా ఒక పదివేల రూపాయలిస్తే చాలని, రాకేష్‌కి వెంటనే వారి కులం అమ్మాయితో పెళ్లి చేయాలని నిశ్చయించారు.

చేసేది లేక కూతుర్ని తీసుకుని ఒక నాటువైద్యున్ని ఆశ్రయించింది. ఆతను కడుపు తీయిస్తానని చెప్పి వీరి దగ్గర సొమ్మంతా పిండేసి రకరకాల పసర్లు, చెట్ల వేళ్ల కషాయాలు వసంతతో తాగించాడు. నాలుగు రోజులు ఇలా వైద్యం చేసి అది ఇక పోయినట్లేనని నమ్మించి వాళ్లని ఇంటికి పంపేశాడు.

అయితే ఊరికి తిరిగొచ్చేసిన రెండు రోజుల తర్వాత గానీ ఆ నాటువైద్యం ప్రభావాలు తెలియలేదు. గర్భం పోకపోగా కొత్త అనారోగ్యాలు మొదలయ్యాయి వసంతకి. అన్ని బాధలతో ఉండి కూడా నెలలు నిండగానే ఒక మగబిడ్డకు జన్మనిచ్చింది వసంత. ప్రసవం తర్వాత కూడా ఆమెకు అనారోగ్యం వెంటాడుతూనే ఉంది.

అంతకు ముందే ఊరి పెద్దలు చెప్పిన తీర్పు ప్రకారం రాకేష్‌కు చంద్రకళతో పెళ్లి చేసేసింది భుజంగరావు కుటుంబం. ఆమె వారికి దూరపు చుట్టం. చంద్రకళ తల్లీతండ్రిదీ ఆ ఊరు కాదు.

ooo

మళ్లీ మబ్బులు కమ్ముకున్నాయి, వర్షం చిన్నగా మొదలైంది.

రాత్రి కురిసింది చాల్లేదనుకుంటా మళ్లీ వాన మొదలైపోయిందంటూ రాధమ్మ విసుక్కుంది. స్నానాలు చేసి భోజనాలు చేసేసరికి మధ్యాహ్నామైంది. వర్షం కూడా బాగా పెద్దదైంది. ఈ వాన ఎటూ వెళ్లనివ్వదు కదా అని మళ్లీ అనుకుంది రాధమ్మ.

సాయంత్రమయ్యే సరికి ఆ ఊరి పక్కనున్న కొండవాగులోకి ఉధృతంగా వరద నీరు చేరింది. ఎగువనున్న కొండల్లో వర్షాలు ఎక్కువగా పడితే ఆ వాగులోకి వరద ఎక్కువగా వస్తుంది. అది ఊళ్లో వాళ్లందరికీ అనుభవమే.

అయితే ఈసారి వర్షాల జోరు ఎక్కువగా ఉండటంతో వాగులో ప్రవాహ వేగం చాలా తీవ్రమైంది. రెండు పక్కనున్న గట్ల అంచుల్ని బాగా బిరుసుకుని ప్రవహిస్తోంది.

ఏ క్షణమైనా గట్లు తెంచేసి వరద రాత్రికి ఊరి మీద పడుతుందనే సమాచారం అక్కడివారికి అందింది. ఆ ఊళ్లో అన్నీ ఇళ్లూ పల్లంలోనే ఉన్నాయి. సాధారణ వర్షాలకే ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయి బురద బురదగా ఉంటుంది. ఇక వరద ముంచెత్తితే ఇంకేమైనా ఉందా.. పేదోడు, పెద్దోడు అనే మినహాయింపులేవీ లేకుండా అన్నింటినీ తనతో ఈడ్చుకుపోతుంది.

ఊళ్లో కాస్త మెరక మీదున్నది స్కూలు భవనాలే. ఈ రాత్రికి



ఎలాగోలా అక్కడే కాలక్షేపం చేసి వరద ముప్పు తగ్గాక తిరిగి రావచ్చని అవసరమైన సరంజామాతో ఊళ్లో ఉన్నవాళ్లంతా స్కూలు బిల్డింగుల దగ్గరకి ఆ మసక చీకట్లోనే బయలు దేరారు.

ooo

"అమ్మా! ఇంకా ఎంత దూరమే...నడవ లేకపోతున్నానే..." బాధగా అంది వసంత.

"అదిగో స్కూలు దరిదాపులకు వచ్చేశాం... కొంచెం ఓపిక కూడదీసుకో" అంటోంది రాధమ్మ.

ఊళ్లో వాళ్లంతా వరద ముప్పు నుంచి తమని తాము కాపాడుకోవడానికి స్కూల్ వైపు వెళ్తుండ టంతో తమ ఇంట్లోనే తిండి తిని తల్లీ కూతుళ్లు కూడా బయలు దేరారు.. స్కూలు దగ్గరికి.

పొట్టలో సెప్టిక్ వల్ల వసంత అడుగు తీసి అడుగేయలేకపోతుంటే రాధమ్మ ఒక చేత్తో కూతురుకు ఆసరా ఇస్తూనే మరో చేత్తో చంకన మనవడు చిన్నోడ్ని వేసుకుని నడుస్తోంది.

ఒకవైపు వర్షానికి తడిసి పోతూ నెత్తి నుంచి నీరు కారుతుంటే నానా అవస్థలూ పడి స్కూలు గేటు లోపలకి అడుగుపెట్టారు. అప్పటికే ఆ స్కూలు నిండా ఊళ్లో జనం ఉన్నారు. కొంతమంది మోతుబరులైతే పరదాలు, దుప్పట్లు పరిచేసి ఆ స్థలం తమదే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. మరికొంతమంది వరండాల్లోనే తలదాచుకుంటున్నారు.

తల్లీ కూతుళ్లు కూడా స్కూలు వరండాలో ఏదో ఒక మూల సర్దుకుని కూచొందామని చూస్తుండగా అప్పటికే స్కూల్లో నిండిపోయి ఉన్నవారు కేకలు వేశారు. చిన్నారితో ఉన్నరనే కనీస కనికరం లేకుండా "మీరు తక్కువ కులపోళ్లు, ఇక్కడికి వచ్చేసి మా అందర్నీ మైల చేయాలనుకుంటున్నారా" అంటూ అరిచారు. ఆ గుంపునకు భుజంగరావే సారథ్యం వహిస్తున్నాడేమో అన్నట్లు వారందరి తరపునా తెగ ఆవేశపడిపోయాడు. ఆ గుంపులోని వారు కూడా భుజంగరావు మాటలకు ఎదురు చెప్పలేదు.

దీంతో మరింత రెచ్చిపోయాడతను నోటికొచ్చిన బూతులు తిడుతూ "ఇక్కడి నుంచి వెళ్తారా లేదా?" అంటూ హూంకరించాడు. రాకేష్‌తో పాటు మరి కొంతమంది అతనికి జత కలిశారు. అయితే ఆ సన్నివేశం భుజంగరావు భార్య వరలక్ష్మికీ, రాకేష్ భార్య చంద్రకళకూ, మరికొంతమంది ఆడాళ్లకూ అంత నచ్చలేదు. తమ మగవాళ్లు చేస్తున్న పని కూడా వాళ్లకి చిరాకన్పించింది. కానీ భుజంగరావు విషయం బాగా తెలుసు కాబట్టి అతని మాటకు ఎదురు చెబితే ఎక్కడ దెబ్బలు తినాల్సివస్తుందోనన్న భయంతో ఆమె ఏమీ మాట్లాడలేదు. చంద్రకళ మాత్రం ఒప్పుకోలేదు. వారూ ఆడవాళ్లూ అందులో పసి పిల్లాడితో వర్షంలో ఎలా గడుపుతారని ఆమెకు అన్పించింది.

"వాళ్లని కూడా స్కూల్లోకి రానీయండి మామయ్యా! ఈ ఒక్క రాత్రి గడిస్తే, రేపు వాళ్లింటికి వెళ్లిపోతారు" అంటూ భుజంగరావుకి నచ్చజెప్పే ప్రయత్నం చేసింది.

వెంటనే రాకేష్ కలగజేసుకుని 'నీకేం తెలియదు... నోర్మూసుకో...! పెద్దనాన్న మాటలకే ఎదురు చెప్తావా..?" అంటూ చంద్రకళ మీదకు చేయి ఎత్తుకుంటూ వెళ్లబోయాడు.

అక్కడి పరిస్థితి గమనించిన తల్లీ కూతుళ్లు స్కూలు గేటునానుకుని ఐరన్‌రేకుతో కట్టిన వంటశాలలోకి నడిచారు.

లోపల పొడిగా లేకపోయినా ఒక మూల

ఆ రాత్రంతా అక్కడున్న మిగిలిన వారంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపారు. వేకువజాము దాటిన తర్వాత గానీ వరద తగ్గలేదు. తన కూతురు కన్పించకపోవడంతో ఆ పసిదాన్ని వరద మింగేసిందని చంద్రకళ కన్నీరు మున్నీరౌతోంది. వరద తగ్గడంతో బయటకు వస్తే పర్వాలేదు అన్పించిన సమయంలో కేర్‌మంటూ ఒక పసిపాప ఏడుపు వంటశాల వైపు నుంచి విన్పించింది.

కూర్చున్నారు వారిద్దరూ చలికి వణుకుతూనే. చిన్నోడిని ఒక మూల పడుకోబెట్టారు. వర్షం క్రమేపీ తగ్గుముఖం పడుతున్నట్లుంది.

అంతలోనే వరద తీవ్రత పెరుగుతున్నట్లు అక్కడున్న అందరికీ అర్థమౌతోంది. ప్రవాహ వేగం వల్ల విన్పించే నీటి రొద ఎక్కువైంది.

"వాగు గట్లు తెగిపోయుంటాయి" అన్నారెవరో వరండాలో ఉన్న జనం నుంచి.

నీటి ప్రవాహం బాగా పెరిగింది. చీకట్లో ఊరుని మింగేసిన వరద స్కూలు వరండాతో సమానంగా ప్రవహిస్తోంది. వంటశాలను తాకుతూ వరద రావడంతో పొయ్యి కట్టెల కోసం ఏర్పాటు చేసిన చిన్న మిద్దెలాంటి దానిపై జాగ్రత్తగా చిన్నోడిని ఉంచింది వసంత. అదే సమయంలో దిగువనున్న రాధమ్మ వరద ప్రవాహంలో కొట్టుకుపోయింది. ఆ విషయాన్ని వసంత గమనించలేకపోయింది. అంతలోనే చంద్రకళ కూతురు లోపల్నుంచి పాక్కుంటూ వరండాలోకి వచ్చేసింది. నీటి శబ్దంతో అటువైపు పాకింది. ఆ విషయాన్ని చూసిన వసంత ఆ పసిపిల్ల వరదతో కొట్టుకుని వెళ్లిపోకుండా వెంటనే దాన్ని పొదివిపట్టుకుని వంటశాలలో ఒక దుంగని గట్టిగా పట్టుకుని కూర్చొంది. జనాల అరుపులు, వరద నీటి గర్జన ఒకదానికొకటి పోటీపడుతూ ఏం జరుగుతోందో ఎవరూ చెప్పలేని పరిస్థితి. వరదకు కొట్టుకుని పోతున్నవారు పోతుండగా, తక్కినవారు తమ చేతికి అందినదాన్ని గట్టిగా పట్టుకుని ప్రాణాలు నిల్పుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

ఆ రాత్రంతా అక్కడున్న మిగిలినవారంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపారు.

వేకువజాము దాటిన తర్వాత గానీ వరద తగ్గలేదు. తన కూతురు కన్పించకపోవడంతో ఆ పసిదాన్ని వరద మింగేసిందని చంద్రకళ కన్నీరు మున్నీరౌతోంది.

వరద తగ్గడంతో బయటకు వస్తే పర్వాలేదు అన్పించిన సమయంలో కేర్ మంటూ ఒక పసిపాప ఏడుపు వంటశాల వైపు నుంచి విన్పించింది.

చంద్రకళతో పాటు మరికొంతమంది అటువెళ్లారు.

అక్కడ వసంత కూర్చుని ఉన్న భంగిమలోనే చనిపోయి ఉంది. ఇనుప రేకు ఒకటి వరద ప్రవాహంతో వేగంగా వచ్చి వసంత వీపులో బలంగా దిగబడిపోయి ఉంది.

ఆమె ఒడిలో పొదివి పట్టుకుని ఉన్న పసిపాప సురక్షితంగా ఉంది.

కట్టెలుంచిన మిద్దె మీద నుంచి చిన్నపిల్లాడి ఏడుపు అందరికీ విన్పించింది. వాడు వసంత కొడుకు చిన్నోడు. వాడిని జాగ్రత్తగా అక్కడ నుంచి తీశారు. తన కూతుర్ని, చిన్నోడ్ని ఎత్తుకుని అక్కడే కూలబడిపోయింది చంద్రకళ. పిల్లాడి ఏడుపు తప్ప మిగతా వాతావరణమంతా గంభీరంగా మారింది. నిర్జీవంగా వరద నీటిలో తేలుతున్న వసంత శవాన్ని చూస్తూ అందరూ స్థాణువుల్లా కదలకుండా చూస్తూ నిలబడిపోయారు. జీవచ్ఛవాల్లా..! విషయాన్ని చిన్నది చేసే ప్రయత్నం చేయబోయాడు భుజంగరావు. మనవరాలిని కాపాడిన వసంత వైపు చూడ్డానికి సిగ్గనిపించింది. తన స్థాయి దిగజారిపోయింది. తుండు అడ్డం పెట్టుకుంటూ దాన్ని సర్దుకునేందుకు అక్కడి వాతావరణాన్ని తేలిక చేస్తూ "అయ్యిందేదో..." అని అతడి నోటి వెంట మాట వచ్చిందో లేదో... చంద్రకళ అగ్నిపర్వతంలా బద్దలైంది. "చావు బతుకుల స్థితిలో కూడా కులాన్ని వదల్లేదు మీరంతా..! వారిని తక్కువ వాళ్లంటూ ఎంత హీనంగా వెలేసినా ఎవరూ చూపలేనంత మానవత్వాన్ని చూపించారు వాళ్లు. ఇప్పుడు చెప్పండి సమాజంలో హీనమైన బతుకులు ఎవరివి? వసంత నా కూతుర్ని బతికించింది. ఆమె బిడ్డకు నేను కన్నతల్లిని కాకపోతే నేనూ మీలానే ఓ హీనురాలినే. ఈ పిల్లాడ్ని కూడా నేనే కన్న కొడుకులా పెంచుతా? కులం, కుటుంబ గౌరవం అంటూ ఎవరైనా అడ్డుపడి వెలేస్తామంటే... అయినా మీరు వెలేసేదేమిటి... నేనే మానవత్వం లేని మిమ్మల్నందర్నీ వెలేస్తున్నా...!" అంది పెద్ద గొంతుకతో. ఆమె స్వరంలోని తీవ్రతకు ఎవరూ మారు మాట్లాడలేకపోయారు. ఆమెకు మద్దతుగా ముందుకు వచ్చి ఆమె చేతుల్లోని చిన్నోడిని అందుకుంది వరలక్ష్మి.

తూరుపు దిశలో వెలుగు రేఖలు పొడుచుకుంటూ... అప్పుడే తెల్లారింది.



చైనా! మనకంటే ఎక్కువ జనాభా ఉన్న దేశం! మనం స్వాతంత్ర్యం సాధించిన నాటి కంటె రెండేళ్ళ తర్వాత భూస్వాముల కబంధ హస్తాల నుండి విముక్తి సాధించిన దేశం! ప్రాచీన ప్రపంచపు ఏడు వింతల్లో ఒకటైన చైనా వాల్‌ని కల్గిన దేశం! ఆ దేశాన్ని దాని ప్రగతినీ చైనా గోడనూ చూడాలనే ఆసక్తి ఉండేది. అలా చైనా పర్యటనకి ఓ రోజు శ్రీకారం చుట్టాం!

నేను చూసిన చైనా

మిత్రులు రమణారావుగారి అబ్బాయి రాంబాబు చైనాలో ఉద్యోగం చేస్తున్నాడు. రాంబాబు ఆహ్వానం మేరకు చైనాలో పర్యటిద్దామని నేను, నా భార్య శుభ నిర్ణయించుకున్నాం. మిత్రులు నరసింహారావు ఆయన భార్య నిర్మల మరో మిత్రులు మాధవరావు, ఆయన భార్య రమాదేవి కూడా చైనా వస్తామన్నారు. మేము ఆరుగురం రమణారావు, ఆయన శ్రీమతి లక్ష్మిగారితో కలిసి ఏప్రిల్ 22వ తేదీ రాత్రి 1-30కు కాథే పసిఫిక్ విమానంలో చైనా బయలుదేరాము. చైనా కాలమానం ప్రకారం 23వ తేదీ మధ్యాహ్నం 1-10కి నాన్‌జింగ్ విమానాశ్రయానికి చేరాము. అక్కడి నుంచి రాంబాబు వాళ్ళింటికి వెళ్ళి ఆ రోజుకు విశ్రాంతి తీసుకున్నాము. 24వ తేదీ ఉదయం రాంబాబు వాళ్ళ కారు డ్రైవర్ సహకారంతో స్థానిక పోలీస్ స్టేషన్‌కు మా పాస్‌పోర్ట్‌లు పంపి తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేయించుకున్నాము. ఇది తాత్కాలిక పర్యటన కోసం వచ్చినవారందరికీ అవసరం. ఆ రోజు సాయంత్రం నాన్ జింగ్‌లోని జీమింగ్ బౌద్ధ దేవాలయాన్ని సందర్శించాము. ఇది విశాలమైన ఆవరణలో అనేక అంతస్తులుగా కట్టబడిన బౌద్ధాలయం. ఇక్కడే కాదు తర్వాత మేము దర్శించిన అనేక బౌద్ధ ఆలయాలలోని ప్రత్యేకతలు ఎన్నో. అవేమిటంటే అన్ని దేవాలయాలలోను ప్రత్యేక స్థలాలలో దీపాలు, కొవ్వొత్తులు, అగరుబత్తులు వెలిగిస్తారు. ప్రధాన విగ్రహాన్ని మోకాళ్ళపై, వంగి, కూర్చొని కళ్ళు మూసుకొని ప్రార్థిస్తారు. మోకాళ్లపై వంగుతూ, లేస్తూ అనేక పార్లు ప్రణామాలు చేస్తారు. చైనా, చలిదేశం కావడంతో ప్రధాన విగ్రహం వద్దకు కూడా చెప్పులు, బూట్లతో రావడానికి ఇక్కడి మతాధికారులు అనుమతిస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన నీళ్ళ కుండీలు, కొలనులు, ఫౌంటెన్లలోకి ప్రజలు నాణేలు వదులుతారు. అలాగే అడ్డంగా కట్టబడిన బొంగులకు ప్రత్యేకమైన రిబ్బన్లు కడతారు. జింగ్ మిన్ దేవాలయంలో చిన్న కొలను లాంటి కట్టడంలో కప్పల రాతి బొమ్మలు ఉన్నాయి. కొలనులో నీళ్ళు లేవు. అయినా ఆ కప్పల చుట్టూ అనేక నాణేలు పడివున్నాయి.

ఏప్రిల్ 25న నాన్‌జింగ్ నుండి బుల్లెట్ ట్రైన్‌లో మేము ఆరుగురమూ బీజింగ్ బయలుదేరాము. నాన్ జింగ్ రైల్వేస్టేషన్ చాలా పెద్దది. మొత్తం 28 ప్లాట్ ఫారాలున్నాయి ఇక్కడ. అది మూడంతస్తులతో ఎయిర్ పోర్టంత పెద్దదిగా విశాలంగా, ఎయిర్ కండీషన్ చేయబడి ఉంటుంది. మేమెక్కిన రైలు స్పీడు సరాసరి 300 కిలో మీటర్లు. రైళ్ళన్నీ ఎయిర్ కండీషన్ రైళ్ళే. అన్ని రైళ్ళలోనూ టాయిలెట్స్ విమానాలలోని టాయిలెట్స్ పద్ధతితో ఉన్నాయి. మేము బీజింగ్‌కు మధ్యాహ్నం 12 గంటలకు చేరాము. రాంబాబు ముందుగానే హోటల్ రూమ్‌లను ఎసి, నాన్ ఎసిలను రిజర్వ్ చేశాడు. హోటల్ చేరుకొని, భోజనాలు చేసుకొని, బీజింగ్ చూడటానికి బయలుదేరాము. మొదట బీజింగ్‌లోని లామా బౌద్ధాలయానికి వెళ్ళాము. అది మొదట్లో ఒక రాజభవనం. 1744లో క్వియాన్ లాంగ చక్రవర్తి ఆ భవనాన్ని లామా ఆలయంగా మార్చివేసి, దానిలో 18 మీటర్ల గంధపు చెక్క బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశాడు. సరియైన మరమ్మత్తులు లేక శిధిలావస్థలో వున్న ఆ దేవాలయాన్ని ప్రస్తుతం కమ్యూనిస్టు ప్రభుత్వం పునరుద్ధరించి ప్రభుత్వ రక్షణలోని బౌద్ధాలయంగా ప్రకటించి, 1981లో ప్రజల సందర్శనార్థం దానిని తెరచివుంచారు. రోజూ కొన్ని వేలమంది భక్తులు దానిని సందర్శించి, 18 మీటర్ల నిలబుద్ధుడికి ధూప, దీప, ప్రణామాలు అందిస్తున్నారు.



ఆ తర్వాత 2008లో బీజింగ్‌లో ఒలింపిక్ క్రీడలు జరిపిన ఒలింపిక్ స్టేడియంను సందర్శించాము. దీని లోపలికి సందర్శకులను అనుమతించడం లేదు. బయటి నుంచి మాత్రమే చూడగలిగాం. దీని నిర్మాణానికి లక్ష టన్నుల స్టీల్‌ను వాడారని అక్కడి వారు చెప్తుంటారు. అంతే కాదు మా గైడ్ కం కార్ డ్రైవర్ కూడా అదే విషయాన్ని చెప్పుకొచ్చాడు. 26వ తేది ఉదయమే బీజింగ్‌కు దగ్గరలోనే ఉన్న చైనా మహా గోడ ను చూడటానికి బయలుదేరాము. వ్యానులో గోడ దగ్గరి వరకు వెళ్ళి బస్సులోనూ కేబుల్ కారులోను ప్రయాణించి, గోడ క్రింది భాగం వరకు వెళ్ళి అక్కడి నుండి చైనాగోడ ఎక్కాము. అది చరిత్రాత్మకమైన గోడ. ఉత్తరం నుండి వచ్చే మంగోలుల దాడి నుండి రక్షించుకోడానికి వీలుగా చైనా ఉత్తర భాగంలో నిర్మించబడింది. మొదట్లో అంటే క్రీ.పూ 7వ శతాబ్దంలోనే చైనాలోని ప్రాంతీయ రాజులు అక్కడక్కడా గోడలు నిర్మించారు. క్రీ.పూ. 214 నుండి క్రీ.పూ 204 వరకు చైనా మొదటి చక్రవర్తి క్విన్ షి హువాంగ్ ఆ చిన్న చిన్న గోడల్ని కలుపుతూ ఒక మహా కుడ్యాన్ని నిర్మించాడు. అదే చైనా మహాకుడ్యంగా పిలువబడే చైనా గోడ. దానిని తర్వాతి చైనా చక్రవర్తులు మరమ్మతులుచేయించారు. పున:నిర్మించారు. చివరిగా, మింగ్ వంశపురాజుల కాలంలో అంటే 1368-1644 మధ్యలో మరమ్మతులు చేయబడి, నిర్మించబడిన గోడలో ఎక్కువ భాగం ఈ నాటికీ నిలిచి ఉంది. ఈ గోడ ప్రస్తుత పొడవు 2450 కి.మీ. ఎత్తు సరాసరిన 9 మీ. దీనిపై ఆ రోజుల్లో రథాలు కూడా వెళ్ళేవి. పురావస్తు తవ్వకాల ప్రకారం శిధిలమైన భాగాలు కలుపుకొని ఈ గోడ పొడవు 6000 కి.మీ. ఆసక్తికరమైన విషయమేమంటే మేము వ్యాను దిగినప్పటి నుంచి చైనా గోడ బురుజు వరకు మొత్తం 500మెట్లు ఎక్కాము. ఇది బస్సు, కేబుల్ కార్లలో ప్రయాణించిన దూరం కాకుండా... గోడకు వెళ్ళే దారి చాలా విశాలంగా, శు

భ్రంగా ఉంది. రోడ్డుకిరువైపులా ఆధునిక భవనాల్లో షాపులు, రెస్టారెంట్లు ఉన్నాయి. షాపుల్లో వస్తువులకు రేట్లు చాలా ఎక్కువ చెబుతారు. బేరమాడితే బాగా తగ్గిస్తారు కూడా. చైనాగోడ గాజు బొమ్మను 80 యువాన్లు చెప్పారు. కానీ బేరమాడేసరికి 15 యువాన్లకే ఇచ్చేసారు. మరో ముఖ్యమైన అంశమే మంటే మహాకుడ్యానికి వెళ్ళే దారిలో దగ్గర దగ్గరగా టాయిలెట్లు ఉన్నాయి. అవి అన్నీ ఆధునిక టెక్నాలజీ కలిగి, చాలా శుభ్రంగా ఉన్నాయి. 26వ తేదీ సాయంత్రం ఒకనాటి చైనా చక్రవర్తుల వేసవి భవనాన్ని సందర్శించాము. అది ఒక ద్వీపంలో ఉండి చుట్టూతా నీటితో ఆవరించబడి ఉంది. సహజంగానే ఆ భవనంలో వేసవి కాలంలో చల్లగా వుంటుంది.

27వ తేదీన ప్రఖ్యాత తియన్‌మిన్ స్క్వేర్‌ను సందర్శించాము. ఆ మైదానంలో కొన్ని లక్షల మంది ప్రజలు సమావేశం కావచ్చు. దాని ప్రక్కనే మావో భౌతిక కాయం ఉంచిన భవనం ఉందిగానీ అది మరమ్మతులలో ఉన్నందున దానిలోనికి సందర్శకులను అనుమతించలేదు. ఆ స్క్వేర్‌లోనే చక్కగా ట్రిమ్ చేయబడిన పూపొదలు అనేకం ఉన్నాయి. ఆ ఆవరణ పక్కనే ఒకనాటి చక్రవర్తుల మహారాజ భవనం ఉంది. దానినే ప్రస్తుతం 'ఫర్‌బిడెన్ సిటీ' (నిషేధిత నగరం) అని పిలుస్తారు. అది భారతదేశంలో రెండు గ్రామాల విస్తీర్ణం ఎంత ఉంటుందో అంత ఉంది. దానిలో చైనా భవన నిర్మాణ పద్ధతిలో నిర్మించబడిన విశాలమైన భవంతులు కొన్ని డజన్లు ఉన్నాయి. దాని ప్రధాన ద్వారం నుండి ఒక్క చక్రవర్తి మాత్రమే వెళ్ళాలి. ఇతరులెవ్వరూ ఆ ద్వారా గుండా ప్రవేశించరాదు. రాణీగారు. వివాహమైన తర్వత మొదటిసారిగా రాజభవనంలోకి ప్రవేశించేటప్పుడు మాత్రం ఆ గేటులోగుండా రావచ్చు. మరెప్పుడూ ఆ గేటులో గుండా రాకూడదు. ఆ మహా రాజభవనాన్ని కూడ మేము సందర్శించాము. విశేషమేమంటే ఆ రోజు సెలవు రోజు కానప్పటికీ వేలాది మంది చైనీయులు ఆ నిషేధిత నగరాన్ని సందర్శించేందుకు వచ్చారు.

మధ్యాహ్నం భోజనాల అనంతరం (స్వర్గదేవాలయం)ను సందర్శించాము. ఆ దేవాలయాన్ని మింగ్ చక్రవర్తుల కాలంలో క్రీ.శ. 1420లో నిర్మించారు. దానిలో మింగ్ క్వింగ్ చక్రవర్తులు ప్రతి సంవత్సరం మంచి పంట దిగుబడి కోసం స్వర్గ దేవతలను ప్రార్థించేవారు. వారి కోసం బలులు అర్పించేవారు. ఆదేవాలయం చైనా భవననిర్మాణ రీతిలో కట్టబడిన ఒక బ్రహ్మాండమైన కట్టడం. ఆ దేవాలయంలో విశేషం ఏమిటంటే ప్రధాన ఆలయానికి వెళ్ళే దారిలో ఉన్న వరండాలో బెంచీలవంటి అరుగుల మీద కూర్చొని, డజన్ల సంఖ్యలో వృద్ధులు పేకాట, చెస్ ఇతర ఆటలు గంటల తరబడి ఆడుతూ కనిపించారు. బహుశ వాళ్ళ స్వర్గం కోసం ఎదురు చూస్తూ అక్కడ అలా కాలక్షేపం చేస్తున్నారేమో?



అక్కడి నుండి బయలుదేరి బీజింగ్ రైల్వేస్టేషన్ సాయంత్రం 4.30కే చేరాము. ఆ రైల్వేస్టేషన్ కూడా ఎయిర్‌పోర్ట్ అంత పెద్దది. అక్కడ సాయంత్రం 6గంటలకు బయలుదేరి మరో బుల్లెట్ ట్రైన్‌లో రాత్రి 10గంటలకు నాన్‌జింగ్ చేరాము.

ఇవీ బీజింగ్ విశేషాలు. షాంఘై, ఊసీ, నాన్ జింగ్‌లోని ఇతర విశేషాలు తరువాతి వ్యాసంలో ముచ్చటించుకుందాం.

- కె.ఎల్. కాంతారావు

ఈ యుగం మాది

కత్తి పద్మారావు కవిత్వం బహుముఖాలుగా విస్తరించిన తీరుకు నిదర్శనం 'ఈ యుగం మాది' కవితా సంపుటి. శ్రీ కత్తి పద్మారావు ఉద్యమకవి, ఉద్యమింపజేసే కవి. సాహిత్యంలో హృదయావిష్కరణ చేస్తున్న కవి. ప్రకృతిని, సమాజాన్ని, మానవ సంబంధాలను సంస్కృతిని, అసమానతలను, వివక్షను, వెలివేతను ప్రశ్నించే కవి. సమాజాన్ని పున:దర్శించాలనే సామాజిక తత్వవేత్త.

కొందరు కవిత్వం రావటానికి పరిమితం అవుతారు. మరికొందరు ఉద్యమాలు చేయటానికి పరిమితం అవుతారు. ఉద్యమ నిర్మాతగా ఉంటూ కవిత్వం రాసే వాళ్ల అరుదుగా ఉంటారు. అటువంటి అరుదైన వ్యక్తి కత్తి పద్మారావు కలం నుండి జాలువారిన ఈ కవితా ఖండికలు ఈ యుగంలో కొత్త చరిత్రనే సృష్టిస్తాయి.

గడచిన మూడేళ్లలో వివిధ పత్రికల్లో ప్రచురించిన 134 కవితలు ఇందులో ఉన్నాయి. నవయుగ కవి చక్రవర్తి జాషువా వారసత్వాన్ని కత్తి పద్మారావు సమాజానికి కొత్త భాష అందించాలని, స్ఫూర్తిని ప్రజ్వరింపచేయాలనే లక్ష్యంతో ఇవి రాశారు.

ప్రారంభ కవిత 'పునర్నిర్మాణం' కవితతో ఈ యుగ లక్షణాన్ని ఆయన పట్టేశారు. "భూమిని తవ్వుతున్న వాడికి రంగురాళ్లు దొరుకుతున్నాయి. భూమిని నమ్మిన వాడికి అస్థికలు మిగులుతు న్నాయి. " "మార్కెట్‌లో ప్రాణం పోసే దానికంటే; ప్రాణం తీసేదానికి ఖరీదు ఎక్కువ" అని రగులు తున్న భూమి సమస్యను అక్షరీకరించారు.

" అగ్నిని పూజిస్తే వర్షం కురుస్తుందని
నేతి డబ్బాలు నిప్పుల్లో పోస్తున్నారు.
మధ్యాహ్నం భోజనంలో నేతి బొట్టువేసే

పుస్తకం పేరు: ఈ యుగం మాది
రచన : డా॥ కత్తి పద్మారావు
లోకాయిత ప్రచురణలు
పేజీలు : 471
వెల : 500/-
ప్రతులకు : కత్తి స్వర్ణ కుమారి
లోకాయిత ప్రచురణలు,
లుంబినీవనం
అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్,
అంబేద్కర్ కాలనీ
పొన్నూరు -522124
ఫోన్ : 9849741695



మానవ సంస్కారం వీరికి వస్తుందా?" అని ప్రశ్నిస్తారు. భారతీయతలో కులాధిక్యత, వివక్షత ఎలా ఉందో

"ఆహార్యంలో అంతే మోడరనైజేషన్
మెదడులో అంతే కల్మషం " అని గుట్టు విప్పారు. "చరిత్రను దోసిళ్లు సృష్టించలేవు, పిడికిళ్లు సృష్టిస్తాయి" అని శ్రమ ప్రాధాన్యతను ప్రకటిస్తారు.

"నిర్భాగ్యానికి, భాగ్యానికి యుద్ధం అని వార్యమే" పోరాట ప్రాధాన్యతని స్పష్టం చేశారు.

'సమాంతర ధ్వని' కవితలో

"ఒక గ్రామంలో ఊరు, వాడ ఎంత వరకూ కలిశాయి.
మీ రోడ్లు వెడల్పయినంత మాత్రాన మీ
మనస్సులు విశాలమైనాయా" అని
ప్రశ్నించారు.

ముందు మాట రాసిన బి.యస్ రాములు చెప్పినట్లు "హృదయాలను ఆవిష్కరించుకోవటానికి, మనహృదయ కల్మషాలను వదిలించుకోవటానికి నిర్మల హృదయంగా ప్రజలను, విశ్వాన్ని ప్రేమించటానికి కత్తి పద్మారావు కవిత్వం చదవటానికి అవసరం' అనేది అక్షర సత్యం. ప్రపంచ వ్యాప్తంగా అణగారిన ప్రజల, వివక్షకు గురైన ప్రజల గొంతు బలంగా వినిపిస్తున్న యుగం ఇది 'ఈ యుగం మాది' దళిత ఉద్యమకేక. బ్రాహ్మణ వాదానికి ప్రత్యామ్నాయ కవిత్వం డా॥ కత్తి పద్మారావు కవిత్వం ఇది.

-భవిష్య

చెట్టు మనిషి

ఒక్క మనిషి ఏం చేయగలడు... అంటే సమద్ అనే ఓ అరణ్యాన్ని మీరు తెలుసుకోవాలి. 50 ఏళ్లుగా ఈ రిక్షావాలా రోజుకో మొక్క చొప్పున నాటుతూ ఓ పచ్చని ఉద్యమాన్ని కొనసాగిస్తున్నాడు. ఇప్పటికే 17,500 చెట్లు ఆయన సంరక్షణలో పెరుగుతున్నాయి. బంగ్లాదేశ్‌కు చెందిన అబ్దుస్ సమద్ షేక్‌కు ఇప్పుడు 60 ఏళ్లకు పైనే. కానీ ఒక్కరోజు కూడా చెట్లని పట్టించుకోవడంలో అశ్రద్ధ



చేయడు. మొక్క నాటకుండా విరామం తీసుకోడు. 12 ఏళ్లకే సమద్ మొక్కలు నాటే పని మొదలుపెట్టాడు. ఇప్పుడు 'ట్రీ సమద్'గా ప్రపంచంతో పిలిపించుకుంటున్నాడు. ఫరీద్‌పూర్ పట్టణంలో రిక్షా తోలే సమద్ అక్కడి ఉద్యానవన కేంద్రానికి వెళ్లి ఓ మొక్క తెచ్చుకుని ఊరిలో ఖాళీ ప్రదేశాల్లో నాటుతుంటాడు. ఆ పని చేయకుంటే ఆయనకు నిద్ర పట్టదు. ప్రభుత్వ భూముల్లోనే ఎక్కువగా చెట్లను పెంచుతుంటాడు. ఎవరైనా చెట్లను నరకడం చూశాడంటే వారికి బుద్ధి చెప్పనిదే అక్కడి నుంచి కదలడు. చెట్టు మీద మరో దెబ్బ పడకుండా తన శరీరాన్ని సమద్ అడ్డంపెట్టే దృశ్యం అక్కడి చాలామందికి తెలిసిందే. చెట్లంటే ఎందుకంత ప్రాణం పెడతావని, కుటుంబం కన్నా అవే ఎక్కువయ్యాయని భార్య జోర్నా ఆగ్రహం చెందడం మామూలే. ఉండటానికి ఇల్లు లేని ఈ నలుగురు పిల్లల తండ్రికి ఇంటివారికి సౌకర్యం సమకూర్చడం కన్నా ఓ మొక్క కొని సంరక్షించడమే ముఖ్యం. భార్య తీరు ఎలా ఉన్నా 30 ఏళ్ల కొడుకు కుతుబుద్దీన్ మాత్రం తండ్రిని సమర్థిస్తాడు. ఎందుకంటే 'ఫరీద్‌పూర్‌లో నాన్న ఒక గ్రీన్ హీరో'. పెద్ద పెద్ద అధికారులు కూడా

గౌరవిస్తారు. ఊరిలో చాలామంది సమద్‌కు ఫాలోవర్లుగా మారి చెట్లను సంరక్షించే ప్రయత్నంలో ఉన్నారు. ప్రసార మాధ్యమాల ద్వారా సమద్ గురించి బంగ్లాదేశ్ దాటి ప్రపంచానికి తెలిసింది. ఇంతకంటే ఏ తండ్రి అయినా ఏం స్ఫూర్తివ్వగలడు బిడ్డలకు. అందుకే బిడ్డలుగా తండ్రి సాకుతున్న చెట్లను సంరక్షించే బాధ్యతను వాళ్లు తీసుకున్నారు. 50 ఏళ్ల ఈ పచ్చదనాన్ని నూరేళ్లు అంతకు వందేళ్లు కాచుకుంటే చాలు తండ్రికి తగ్గ బిడ్డలనిపించుకుంటారు. నూరేళ్లు కన్నబిడ్డలవి... అంతకు వందేళ్లు పెంపుడు వృక్షాలవి.

ధనియా ఖీమా మటర్

కావాల్సిన పదార్థాలు

మటర్ ఖీమా: 1/2 కిలో
పచ్చి బఠాణీ-1/2 కప్పు
కొత్తిమీర తరుగు-4 టేబుల్ స్పూన్లు
నూనె-4 టేబుల్ స్పూన్లు
ఉల్లిపాయలు- రెండు
గరంమసాలా 1 టేబుల్ స్పూన్
అల్లంవెల్లుల్లి పేస్ట్ 2 టేబుల్ స్పూన్లు
ధనియాలపొడి-3 టేబుల్ స్పూన్లు
కారం- 2 టీ స్పూన్లు
పెరుగు-1/2 కప్పు
ఉప్పు-సరిపడా
నెయ్యి-1 టీ స్పూను

తయారుచేసే విధానం

ముందుగా బఠాణీని శుభ్రంగా కడిగి ఉడికించి పక్కనపెట్టుకోవాలి. ఒక బౌల్‌లో ఉప్పు, కారం, ధనియాలపొడి, పసుపు వేసి పక్కన పెట్టుకోవాలి. బాణలిలో నూనె వేసి వేడెక్కిన తర్వాత ఉల్లిపాయ ముక్కల్ని వేసి వేయించుకోవాలి. తర్వాత గరం మసాలా, అల్లంవెల్లుల్లి వేసి కలపాలి. ఇప్పుడు పెరుగు మిశ్రమం కూడా వేసి ఓ నిమిషం ఉడికించాలి. తర్వాత కీమా వేసి ఓ రెండు నిమిషాలు వేయించాలి. తర్వాత తగినన్ని నీరుపోసి అందులో కొద్దిగా నెయ్యి వేసి మూతపెట్టాలి. నీళ్ళన్నీ ఆవిరయ్యేంత వరకూ ఉడికించాలి. బఠాణీలు వేసి మరో కప్పు నీళ్లుపోసి ఉడికించి స్టౌపై నుండి దించేయాలి. చివరిగా కొత్తిమీర తరుగుతో గార్నిష్ చేస్తే ధనియా ఖీమా మటర్ రెడీ!

రుచి

దమ్ ఖీమా

కావాల్సిన పదార్థాలు

ఖీమా-1/2 కేజీ
ఉల్లిపాయలు-4
కొబ్బరి-100 గ్రాములు
గరంమసాలా-1 టేబుల్ స్పూన్
గసగసాలు-2 టేబుల్ స్పూన్లు
కారం, ఉప్పు-రుచికి తగినంత
పసుపు- 1/4 టీ స్పూన్
పెరుగు-100 గ్రాములు
నూనె-1/4 కేజీ
కొత్తిమీర తరుగు-1/4 కప్పు
పుదీనా తరుగు- 1/4 కప్పు
పచ్చిమిర్చి-4

తయారుచేసే విధానం

ముందుగా కొబ్బరి, ఉల్లిపాయల్ని కట్ చేసి పక్కనపెట్టుకోవాలి. ఒక బాణలిలో నూనె వేసి వేడెక్కిన తర్వాత గసగసాలు, కొబ్బరి, ఉల్లిపాయ ముక్కల్ని వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించుకోవాలి. కొద్దిగా చల్లారిన తర్వాత ఈ మిశ్రమాన్ని రుబ్బుకోవాలి. ఇప్పుడు స్టౌపై ఒక మందపాటి పాత్రని వుంచి బాగా కడిగిన ఖీమాని వేసి కలుపుకుని అందులో కారం, పసుపు, ఉప్పు, గరంమసాలా, పెరుగు కూడా చేర్చి సరిపడా నీరు పోసి కుక్కర్‌లో పదిహేను నిమిషాలపాటు ఉడికించుకోవాలి. మూత తీసి పదార్థం మొత్తం గట్టిపడే వరకూ ఉడకనివ్వాలి. ఇప్పుడు బాగా కలిపి దింపేయాలి. దమ్ ఖీమాని కొత్తిమీర, పుదీనా తరుగు, ఉల్లిపాయముక్కలతో గార్నిష్ చేసి వేడి వేడిగా సర్వ్ చేయండి.

హర్యాలీ వెజ్ బాత్

కావాల్సిన పదార్థాలు

పచ్చి బఠాణీలు-1/2 కప్పు
కొత్తిమీర తరుగు-ఒకటిన్నర కప్పు
నూనె-3 టేబుల్ స్పూన్లు
తోటకూర, పాలకూర తరుగు-1 కప్పు చొప్పున
టమాటా- కప్పు
అజినోమోటో-చిటికెడు
పచ్చిమిర్చి-6
అన్నం-2.1/2 కప్పులు
ఉప్పు-రుచికి తగినంత
షాజీర-1 టేబుల్ స్పూన్
కరివేపాకు రెబ్బలు-4



తయారుచేసే విధానం

ముందుగా పచ్చి బఠాణీలని ఉడికించి పక్కన పెట్టుకోవాలి. కొత్తిమీర, తోటకూర పాలకూర, టమాటా, పచ్చిమిర్చి సన్నగా తరిగి మిక్సీలో వేసి మెత్తగా రుబ్బుకోవాలి. తరవాత బాణలిలో కాస్త నూనె వేసి వేడెక్కిన తర్వాత షాజీర, ఆకుకూర ముద్ద వేసి వేయించాలి. కొద్దిసేపటి తర్వాత అజినోమోటో, ఉడికించిన బఠాణీలు, అన్నం వేసి బాగా కలియతిప్పాలి. చివరిగా కరివేపాకుతో అలంకరించుకొని దించేస్తే హరియాలి వెజ్ బాత్ రెడీ!

ఆకుతో గుడ్లగూబ

పిల్లలూ మీకు బొమ్మలంటే భలే ఇష్టం కదూ... మనింటి ముందు రాలిపడే పచ్చి ఎండుటాకులతో గుడ్లగూబ బొమ్మ ఎలా చేయాలో ఇక్కడుంచాం. మీరూ ప్రయత్నించండి.



లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్ నేనో బాలీవుడ్ స్టార్‌ని! ఇది నా చిన్ననాటి ఫోటో ఇంతకీ నేనెవరో చెప్పండి?

జ : అక్షర హాసన్

పదాలు పూరించండి

ఇక్కడ మొత్తం తొమ్మిది బొమ్మలు ఉన్నాయి. అయితే వాటి ఇంగ్లిష్ పేర్లలో ఒక్కో అక్షరం మిస్సైంది. ఆ అక్షరాన్ని కలిపితే పదం పూర్తవుతుంది. బొమ్మల ఆధారంగా మిస్సైన అక్షరాన్ని గుర్తించి ఖాళీలో నింపండి!

		
C _ R _	_ P _ L E	_ R M
		
_ I R _	_ A N A _ A	_ O _ K
		
C _ _ D	B _ L _	_ I _ E

జ : cart, apple, arm, bird banana, book, card, belt, bike

ఏ నీడ ఎవరిది



పిల్లలూ! ఇక్కడ కొన్ని జంతువుల ముఖాలు వాటి ముందు కొన్ని నీడలు ఉన్నాయి. ఏ జంతువు నీడ ఎక్కడుందో గుర్తించి వాటిని జతచేయండి.

గుర్తించండి!

పిల్లలూ..! ఇక్కడ మీరు చూస్తున్న ఫోటోలో పక్కన ఉన్న బొమ్మలు దాగున్నాయి అవి ఎక్కడున్నాయో గుర్తించండి.

ఎన్నున్నాయి?



ఇక్కడ కనిపిస్తున్న వ్యక్తి ముఖంలో కొన్ని జంతువులు కూడా దాగున్నాయి. అవెక్కడున్నాయో గుర్తించి సున్నా చుట్టేయండి.

ప్లాస్టిక్ పూలు



పిల్లలూ మీకు బొమ్మలు తయారు చేయడమంటే భలే ఇష్టం కదా... అయితే ఈ సారి మీరు డ్రింక్/మంచినీళ్ళు తాగిన తర్వాత బాటిల్స్‌ని పడేయకుండా దాచిపెట్టండి ఎందుకంటే వాటితో అందమైన పూలు, డెకరేటివ్ ఐటమ్స్‌ని తయారుచేసుకోవచ్చు. అవెలా తయారు చేయాలో మేం నేర్పిస్తాం. మీరు జాగ్రత్తగా ప్రయత్నించండి.

కావాల్సిన వస్తువులు

ప్లాస్టిక్ బాటిల్స్-4, కత్తెర, చాకు, మార్కర్, యాక్రిలిక్ పెయింట్, క్యాండిల్, మార్కర్- నలుపు రంగు, రాలిపోయిన చెట్టుకొమ్మ, పాత టీ కప్.

తయారుచేసే విధానం

డ్రింక్/వాటర్ బాటిల్స్‌ని తీసుకుని వాటి అడుగుభాగానికి కాస్త పైన మార్కర్‌తో మార్క్ చేసుకోవాలి. కత్తెరతో జాగ్రత్తగా కత్తిరించాలి. బొమ్మలో చూపిన విధంగా పువ్వు ఆకారంలో వుండేలా చివర్లని జాగ్రత్తగా కత్తిరించుకోవాలి. ఇలా మీకు ఇష్టమైనన్ని పూలని తయారుచేసుకోవచ్చు. ఇప్పుడు యాక్రిలిక్ పెయింట్/ మార్కర్‌ని ఉపయోగించి పువ్వు లోపలి భాగంలో ఎరుపు రంగుని అద్దాలి. తర్వాత నలుపు రంగు స్కెచ్ పెన్‌తో పువ్వు మధ్యభాగంలో బొమ్మలో చూపిన విధంగా గీసుకోవాలి. ఇప్పుడు క్యాండిల్ వెలిగించి పువ్వు చివర్లకి మంటతగిలేలా వుంచి తీసేయాలి. చివరిగా ఇక ఇనుప తీగని తీసుకుని కాస్త వేడెక్కనిచ్చి ఒక్కో పువ్వు రెక్కపై గుచ్చి రంధ్రాన్ని చేసుకోవాలి. ఇప్పుడు నచ్చిన రంగు దారాన్ని తీసుకుని ఒక్కో పువ్వుకి ఏర్పరిచిన రంధ్రానికి ఒక చివరని ముడేయాలి. ఇప్పుడు చెట్టుకొమ్మ తీసుకుని దానికున్న చిన్న కొమ్మలకి ఒక్కో ప్లాస్టిక్ పువ్వుకివున్న దారంతో ముడేయాలి. ఇలా అన్నిటినీ మీకు నచ్చిన ఆకారంలో అమర్చిన తర్వాత ఆ కొమ్మని పక్కన పెట్టుకోవాలి. చివరిగా మీడియం సైజు టీ కప్పులో మూడొంతులు ఇసుక పోసి అందులో ఈ చెట్టుకొమ్మని గుచ్చితే ప్లాస్టిక్ పూల కొమ్మ రెడీ! దీన్ని ఫ్రిజ్ లేదా మీ టేబుల్ మీద పెట్టుకుంటే అందంగా ఉంటుంది.

పదవికాసం 68

కూర్పు: రావెళ్ళ

✿	1	2		✿	3	4		✿
5	✿		✿	6	✿		✿	✿
7		✿	8			✿	9	10
	✿	11	✿		✿	12	✿	
13				✿	14			
	✿		✿	15	✿		✿	
16		✿	17			✿	18	
✿	✿	19	✿		✿	20	✿	
✿	21			✿	22			✿

ఆధారాలు

అడ్డం

1. తప్పునిసరిగా (3)
3. గింజ (3)
7. జంబుకం (2)
8. అంతం లేనిది (3)
9. విడిది (2)
13. వ్యర్థంచేయు (4)
14. తెలుగు సంవత్సరాల్లో ఆరోది (4)
16. రాత (2)
17. పేకముక్కలతో ఆడే ఆట (3)
18. అటు నుండి బురద (2)
21. వేడుక (3)
22. గాలిపటం (3)

నిలువు

2. తిరగబడిన రాజీ (2)
4. తలకిందులుగా కసువు (2)
5. రోజు కూలి (6)
6. సంతోషం (3)
10. ఏడు సముద్రాలు (6)
11. సంసారం (3)
12. గెలవాలనే కోరిక (3)
15. ఎముకల గూడు (3)
19. పట్టణం (2)
20. పాదరసం (2)

సుడోకు

5	7	1						
			8	2	5			
						6	5	4
3	1	4						
			2	7	4			
						5	4	6
7	9	2						
			5	1	7			
						4	3	7

గతవారం జవాబులు

9	8	4	7	1	5	3	2	6
5	1	6	4	2	3	7	8	9
2	7	3	9	6	8	4	5	1
3	4	8	5	7	9	6	1	2
1	9	7	6	3	2	5	4	8
6	2	5	8	4	1	9	7	3
4	5	2	1	9	6	8	3	7
7	3	9	2	8	4	1	6	5
8	6	1	3	5	7	2	9	4

1 ప	ద	2 హా	రు	✿	3 బి	4 రు	స	5 గు
సి	✿	ని	✿	6 మొ	✿	తి	✿	రి
7 పా	వు	✿	8 మొ	గు	ళ్ళు	✿	9 ద్ధ	పె
ప	✿	10 చా	✿	డు	✿	11 మ	✿	ట్టు
✿	12 న	టు	డు	✿	13 మ	ధు	రం	✿
14 బీ	✿	వు	✿	15 వ	✿	పం	✿	16 వ
17 జ	గం	✿	18 న	ర్త	కి	✿	19 న	ల్ల
కో	✿	20 శా	✿	కం	✿	21 క	✿	కా
22 శం	పా	ల	త	✿	23 మొ	ల	తా	డు

అది ఆస్ట్రేలియాకు రెండింతలుంటుంది. అమెరికాను, కెనడాను, యూరప్‌ను మించి ఉంటుంది. కానీ సైబీరియా ఇంకా తెల్లటి మంచు పొరలోనే దాక్కుని బయటి ప్రపంచానికి అంతగా పరిచయం కాలేదు. మంచు ఎడారియైన సైబీరియాలోను వేల ఏళ్లుగా మనుగడ సాగిస్తున్న మంచు మనుషుల గురించి లోతుగా ఇంకేం తెలుస్తుంది. అక్కడి మరో మనిషి గురించి తెలుసుకోవాలంటే పెద్ద సాహసం చేయాల్సిందే. అదే పని చేస్తున్నాడు అలెగ్జాండర్ ఖిముషిన్. ప్రపంచం చుట్టేస్తూ వాటి వివరాల్ని, విశేషాల్ని ఓ బ్యాక్ ప్యాక్‌లో వేసి మనకు అబ్బురంగా తెలియజేస్తున్న అరుదైన పర్యాటకుడతడు. ఇప్పటికే 84 దేశాలు తిరిగేశాక ఎవరూ సాహసించని సైబీరియా చలి లోకం అస్పష్టంగా కనిపించింది. దాని మంచు తెరలు తొలగించి అక్కడి మరో మనిషి గురించి తెలుసుకుంటూ ఇప్పటికే 25 వేల కి.మీ.లు తిరిగాడు. తన 'ది వరల్డ్ ఇన్ ఫేసెస్' (ముఖాల్లో ప్రపంచం) పేరిట ఓ ప్రాజెక్ట్‌లో భాగంగా అక్కడి మనిషి పొట్రెయిట్‌లు ప్రపంచానికి పంచుతున్నాడు. బైకాల్ తెన్ను నుంచి జపాన్ సముద్రం తీరం దాకా... మంగోలియా సోపానాల (స్టెప్పీ) నుంచి భూమిపైనే అత్యంత శీతల ప్రాంతంగా గుర్తించిన యకూతియా వరకు తనకు ఎదురుపడిన... తను ఎదురెళ్లిన సైబీరియా తెగల సంస్కృతి, మనుగడ పోరాటాల్ని వారి ముఖ చిత్రాలతో బంధించాడు. యకూతియాలోనే పుట్టి పెరిగిన అలెగ్జాండర్‌కు మంచుతో మంచి మిత్రత్వమే కుదిరిందేమో..! మిగతా ఆధునికులు చేరని మంచు తీరాలకు వెళ్లాడు కూడా. గైడ్ బుక్‌ల్లో, రూట్‌మ్యాపుల్లో కనిపించని ప్రపంచపు తెరలను తొలగిస్తున్నాడు. వైవిధ్యంలోని అనిర్వచనీయతని తన ఫొటోల ద్వారా వివరించే ప్రయత్నం చేశాడు. సైబీరియా మూల వాసుల్ని ఆధునిక మనిషికి సరికొత్తగా పరిచయం చేశాడు. అంతరించిపోవడానికి దగ్గరగా ఉన్న తెగలు... అమేయ ప్రకృతితో తలపడి సర్వైవల్ ఈక్వేషన్ సరిసమాప్తం చేయని తెగువలు కళ్లకు కట్టాడు.

యుల్చి


ఒరాక్వెన్

సైబీరియా ముఖ చిత్రం

చుక్చా

నివ్కి

సఖా

ఎవెంకి

యకూత్

చినుకు తడిమితే...



తొలి చినుకు ముఖాన్ని తడిమితే అది తొలి వలపంత అనుభూతినిస్తుంది. ఆకాశానికేసి మోముని పైకెత్తడం... మబ్బుల్లోంచి జాలువారుతున్న వర్షపు తొలి జల్లులకు సిద్ధం కావడం... మనిషి ప్రకృతిల ప్రణయ సంకేతం. నేను ప్రకృతిని ప్రేమిస్తున్నానని మౌనంగా చెప్పే ఓ సింబాలిక్ పోస్టర్. ఇదే భంగిమను శిల్పకారుడు నాజర్ బిల్యిక్ స్తంభింపజేశాడు. నీటి బొట్టు చెదిరి ముఖాన్నంతా ఆవరించే ముందటి క్షణాన్ని శిల్పంలోకి మలిచాడు. ఉక్రెయిన్‌లోని కీవ్‌లో ఈ ప్రకృతి-మనిషి అనురాగం ఆరడుగుల ఎత్తున నిలిచి కనిపిస్తుంది. కాంస్యం, గాజులను మిళితం చేసి రూపునిచ్చిన ఈ శిల్పానికి 'ది రెయిన్' అని పేరు పెట్టారు. అక్కడి ఫ్యాషన్ పార్కులో పెయ్యాజ్నా యాల్లే (ల్యాండ్‌స్కేప్ యాల్లే)లో ఈ శిల్పాన్ని దగ్గర నుంచి చూడొచ్చు.



Check List

Book Number	KNSR02B175	Date	3/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Lakshmi	Cutting By	Lakshmi
Scanned By	Pradhyu	Pages	29